PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...




ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 34, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 25 - మార్చి - 2026 , వెల రూ.5/-

## మతం మారితే ఎస్సీ, ఎస్టీ హోదా రద్దు..

మత మార్పిడి తర్వాత కూడా పాత కుల హోదాను కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధం




రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ హోదా అనేది కేవలం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలకు చెందిన వారికే వర్తిస్తుంది

ఢిల్లీ: షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) లేదా షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) చెందిన వారు క్రైస్తవం, ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారితే, వారికి రాజ్యాంగబద్ధంగా లభించే కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవని

## ‘జల్ జీవన్ మిషన్ 2.0పై కేంద్రంతో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ... ఎన్నికల హామీల్లో ఇది కూడా ఒకటన్న చంద్రబాబు




2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో ‘హర్ ఘర్ జల్’ (ప్రతి ఇంటికి కుళాయి నీరు) లక్ష్యం

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇది కూడా ఒకటి

గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

## ఆంబోతుల కొట్లాటలో సామాన్యులే బలి: కేటీఆర్

రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది




అంతర్జాతీయ పరిణామాల సాకుతో సామాన్యులకు సిలిండర్లు దొరకకుండా చేస్తున్నారు




## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

సీఎం చంద్రబాబు

- ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి
- డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యం
- ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం

# అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

## సీఎం చంద్రబాబు వ్యక్తం చేసిన ప్రధాన సందేహాలు

- ప్రమాదమా లేక ఎవరైనా కావాలని చేస్తున్న కుట్రనా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలి
- గత కొద్ది రోజులుగా మూడు సార్లు ఇలాంటి ప్రమాదాలు జరగడం యాదృచ్ఛికం కాదు
- రాయపూడి ఘటనపై సీఎం చంద్రబాబు హైలెవల్ రివ్యూ!
- రాజధాని ప్రాంతంలో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేసేలా ఈ భేటీలో కీలక నిర్ణయాలు



అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం అవుతున్న తరుణంలో, వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. రాయపూడిలోని హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ ప్రాంతంలో మేఘా సంస్థకు చెందిన భారీ ప్లాస్టిక్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... మిగతా..2లో




## అమెరికా మా షరతులకు అంగీకరిస్తేనే యుద్ధం ఆగుతుంది: ఇరాన్

- అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల విషయంలో కీలక పరిణామం
- అమెరికా మెత్తబడినప్పటికీ ఇరాన్ మాత్రం తన వైఖరిని స్పష్టం

# హైదరాబాద్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్

## మెరుగైన వసతులు ఏర్పాటు చేసి తరలిస్తాం

- మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పిస్తాం: సీఎం రేవంత్
- ఉసిగొల్పే వాళ్ల ఉచ్చులో పడొద్దు.. పార్టీలు అపోహలు సృష్టించకూడదు
- మీరు సలహాలు ఇస్తే తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటాం..
- అందరం కలిసి హైదరాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసుకుందాం



హైదరాబాద్: ఎంతో ఘన చరిత్ర ఉన్న హైదరాబాద్‌లో మానవ తప్పిదాలతో సమస్యలు వస్తున్నాయి. నగరంలో వాహనాల సంఖ్య పెరిగింది. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేశాం. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు జోన్లుగా మిగతా..2లో




## ఆర్టీజీ సేవలపై మంత్రి లోకేశ్ కీలక ప్రకటన

- (ఆర్టీజీ) సేవలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి
- ఆర్టీజీకి విదేశీ విరాళాల స్వీకరణకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి
- పేదల ఇళ్ల నిర్మాణం, నిరుపేద పిల్లల చదువు, ఉపాధి, వైద్యం వంటి రంగాల్లో ఆర్టీజీ చేస్తున్న కృషిని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు వివరించాం
- ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాతో పాటు కేంద్ర ప్రభుత్వ అధికారులకు లోకేశ్ కృతజ్ఞతలు



## ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్..

మంత్రి కోమటిరెడ్డి స్పష్టత

- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉంది
- తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం
- ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లైఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు

## మోదీ నిర్ణయాధికారంపై ట్రంప్ కు కూడా అవగాహన ఉంది

### రాహుల్ గాంధీ వ్యంగ్యం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు

జాతీయ ప్రయోజనాలకు బదులుగా అది ప్రధాని “వ్యక్తిగత విదేశాంగ విధానం”గా మారిపోయింది

‘ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే. ఈ విషయం అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది“



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భారతదేశ విదేశాంగ విధానం పూర్తిగా బలహీనపడిందని, జాతీయ ప్రయోజనాలకు బదులుగా అది ప్రధాని “వ్యక్తిగత విదేశాంగ విధానం”గా మారిపోయిందని మిగతా..2లో

## పశ్చిమాసియా పరిస్థితులు... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

ఆయా దేశాల్లో చిక్కుకున్న మనవారిని సురక్షితంగా తీసుకువచ్చాం

- అక్కడ యుద్ధం జరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు వస్తున్నాయి
- ఇంధన సంక్షోభానికి దారితీసిందని ఆందోళన వ్యక్తం
- ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయి



ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న మనవారిని సురక్షితంగా తీసుకువచ్చామని తెలిపారు. మిగతా..2లో

## బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు

- ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారు
- తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారు
- ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించాల్సిన దుస్థితిని కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలి




హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మిగతా..2లో

## తప్పుడు కేసులు పెరిగిపోతున్నాయి...
# కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా క్రిమినల్ న్యాయ వ్యవస్థలో పెరుగుతున్న తప్పుడు ఫిర్యాదులు, కల్పిత ఆరోపణలు, నకిలీ సాక్ష్యాల సమస్యపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం.. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసులో తదుపరి విచారణ మే 11న జరిగే అవకాశం ఉంది. భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), 2023లోని సెక్షన్లు 215, 379లను ఉన్నది ఉన్నట్లుగా అన్వయించడం వల్ల పలు శిక్షాస్మృతి నిబంధనలు నీరుగారిపోతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్లను తప్పుడు ఎఫ్ఐఆర్‌లతో, కోర్టులను తప్పుడు కేసులతో ముంచెత్తుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం తప్పుడు కేసుల బాధితులు నేరుగా న్యాయపోరాటం చేసేందుకు కోర్టు నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి కావడం, జవాబుదారీతనానికి ఇది అడ్డంకిగా మారిందని పిటిషనర్ వాదించారు. తప్పుడు కేసుల బెదిరింపుల వల్ల అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో ఒక కుటుంబం తప్పుడు కేసుల బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, తప్పుడు కేసుల బాధితులు నేరుగా కోర్టు అనుమతితో ఫిర్యాదు చేసేలా బీఎన్ఎస్ఎస్ చట్టంలోని నిబంధనలకు సరైన భాష్యం చెప్పాలని పిటిషనర్ కోరారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని, అమాయక పౌరులను కాపాడేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పశ్చిమాసియా సంక్షోభం...
## పాకిస్థాన్ మధ్యవర్తిత్వం అంతా వట్టిదేనా..!

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తోందంటూ వస్తున్న వార్తలను రాజకీయ విశ్లేషకుడు తెహసీన్ పూనావాలా తీవ్రంగా ఖండించారు. ఇదంతా పూర్తిగా 'ఫేక్ న్యూస్' అని ఆయన కొట్టిపారేశారు. ఇలాంటి నిరాధార వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేస్తుందనే వార్తను ప్రచురించిన వారు పాక్ కు చెందిన వారై ఉంటారు. ఇది నమ్మశక్యం కాని విషయం" అని పూనావాలా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఓవైపు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి ఆర్థిక సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న పాకిస్థాన్, ఇంతటి పెద్ద వివాదంలో మధ్యవర్తిగా ఎలా వ్యవహరిస్తుందని ఆయన ప్రశ్నించారు. అమెరికా, చైనా, సౌదీ అరేబియా వంటి దేశాలపై పాక్ ఆధారపడి ఉందని, అలాంటిది ఈ దేశాల మధ్య ఉన్న విభేదాల్లో తలదూర్చే స్థాయి పాకిస్థాన్ కు ఉందా?" అని సందేహం వ్యక్తం చేశారు. "కొన్నేళ్ల క్రితం ఇరాన్, పాకిస్థాన్‌లు ఒకరిపై ఒకరు క్షిపణులు ప్రయోగించుకున్నాయి. ఇటీవలే రంజాన్ మాసంలో ఆఫ్ఘనిస్థాన్‌పై పాక్ బాంబుల వర్షం కురిపించింది. ఇలాంటి చరిత్ర ఉన్న దేశం శాంతి కోసం మధ్యవర్తిత్వం ఎలా చేస్తుంది?" అని పూనావాలా విమర్శించారు. ఒకవేళ నిజంగా మధ్యవర్తిత్వం చేస్తుంటే, దాన్ని బహిరంగంగా ఎందుకు ప్రచారం చేసుకుంటారని ఆయన నిలదీశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం వహించే సత్తా కేవలం ఖతార్, ఒమన్, భారత్‌లకు మాత్రమే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ప్రపంచం కోరుకోవడం లేదని, చమురు సంక్షోభానికి ముగింపు పలికేందుకు భారత్ సహా అన్ని దేశాలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ ఎన్నికల పోరు

బెంగాల్‌లో దీదీ హ్యాట్రిక్.. తమిళనాట స్టాలిన్ జోరు!

ఢిల్లీ: దేశంలోని నాలుగు కీలక రాష్ట్రాలు, యూటీ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, పలు సంస్థలు నిర్వహించిన ఒపీనియన్ పోల్స్ ఆసక్తికర ఫలితాలను వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అధికార పార్టీలే తిరిగి పీఠమెక్కనుండగా, అస్సాంలో బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోనుంది. అయితే, కేరళలో మాత్రం హోరాహోరీ పోరు తప్పదని ఈ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.

బెంగాల్‌లో మమత హ్యాట్రిక్..

'వోట్ వైబ్' సంస్థ సర్వే ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తోంది. మొత్తం 294 స్థానాలున్న రాష్ట్రంలో టీఎంసీ 184 నుంచి 194 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. గట్టి పోటీ ఇస్తుందనుకున్న బీజేపీ 98 నుంచి 108 స్థానాలతో సరిపెట్టుకోవచ్చని, లెఫ్ట్ పార్టీలు 1 నుంచి 3 సీట్లకే పరిమితమవుతాయని పేర్కొంది.

తమిళనాట డీఎంకే క్లీన్ స్వీప్..

'అగ్ని న్యూస్ సర్వీస్ (ఏఎన్ఎస్)' సర్వే ప్రకారం, తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూటమి క్లీన్ స్వీప్ చేయనుంది. మొత్తం 234 స్థానాలకు గాను డీఎంకే కూటమి ఏకంగా 180 సీట్లు కైవసం చేసుకుంటుందని తెలిపింది. ప్రతిపక్ష అన్నాడీఎంకే-బీజేపీ కూటమి 50 నుంచి 60 స్థానాలకే పరిమితం కానుంది. ఇదే సమయంలో, రాజకీయ రంగ ప్రవేశం చేసిన నటుడు విజయ్ 'టీవీకే' పార్టీ సుమారు 10 శాతం ఓట్లను చీల్చనుందని గమనార్హం.

అస్సాం, కేరళలో ఇలా..

ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి తన అధికారాన్ని నిలబెట్టుకోనుంది. 'వోట్ వైబ్ సర్వే ప్రకారం.. 126 సీట్లలో ఎన్డీయే 80 నుంచి 90 స్థానాల్లో గెలుపొందనుంది. విపక్ష ఇండియా కూటమికి 29 నుంచి 39 సీట్లు దక్కవచ్చని అంచనా. మరోవైపు, కేరళలో మాత్రం అధికార, విపక్ష కూటముల మధ్య నువ్వా? నేనా? అన్నట్లుగా పోరు సాగనుంది. 'మ్యాట్రిజ్-ఐఏఎన్ఎస్' సర్వే ప్రకారం, 140 స్థానాలున్న కేరళలో అధికార ఎల్డీఎఫ్ కూటమికి 61-71 సీట్లు, యూడీఎఫ్‌కు 58-69 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపింది.

## ఆర్డీటీ సేవలపై మంత్రి లోకేశ్ కీలక ప్రకటన

అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సేవలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఈ సంస్థకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) కింద లైసెన్స్ రెన్యువల్ పూర్తయినట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దీంతో ఆర్డీటీ విదేశీ విరాళాల స్వీకరణకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు లోకేశ్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఆర్డీటీ సేవలు నిలిచిపోవని గతంలోనే మాట ఇచ్చాను, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు వివరించారు. పేదల ఇళ్ల నిర్మాణం, నిరుపేద పిల్లల చదువు, ఉపాధి, వైద్యం వంటి రంగాల్లో ఆర్డీటీ చేస్తున్న కృషిని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు వివరించినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని, దీంతో ఆర్డీటీ రెన్యువల్ ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో పాటు కేంద్ర ప్రభుత్వ అధికారులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దశాబ్దాలుగా సేవా స్ఫూర్తితో పనిచేస్తున్న ఆర్డీటీ నిర్వాహకులు మాంచో ఫెర్రర్‌కు అభినందనలు తెలిపారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్..

హైదరాబాద్: ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లైఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

## పశ్చిమాసియా పరిస్థితులు...
## రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన



ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న మనవారిని సురక్షితంగా తీసుకువచ్చామని తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులపై ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ, పశ్చిమాసియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. అక్కడ యుద్ధం జరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు వస్తున్నాయని, ఇంధన సంక్షోభానికి దారితీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, హర్మూజ్ జలసంధి మీదుగా భారత చమురు నౌకలు వస్తున్నాయని వెల్లడించారు. ఆ నౌకలు సురక్షితంగా మన పోర్టులకు చేరేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అక్కడి నుంచి 3.54 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చామని అన్నారు. ఈ దాడుల్లో కొంతమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారని సభకు తెలిపారు. గల్ఫ్ దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కారమని ప్రధాని మోదీ అన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్

మొదటి పేజి తరువాయి

రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు జోన్లుగా విభజించాం. క్యూర్ పరిధిని సేవా రంగంగా, ప్యూర్‌ను తయారీ కేంద్రంగా, రేర్‌ను వ్యవసాయ ప్రాధాన్యతగా అభివృద్ధి చేయబోతున్నాం. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం (క్యూర్)లోని కాలుష్య కారక పరిశ్రమలను బయటకు తరలిస్తేం నగరం నివాస యోగ్యంగా మారుతుంది. అందుకే హిల్ట్ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్‌ను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసే క్రమంలో ఒకే విధమైన పరిపాలన విధానం కోసం మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, నాలుగు పోలీసు కమిషనరేట్లు ఏర్పాటు చేశాం. భవిష్యత్ అభివృద్ధి కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను తయారు చేశాం..'అని సీఎం తెలిపారు. నల్లగొండ జిల్లా ప్రజల కష్టాలను చూస్తే మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును ఎవరూ అడ్డుకోరు. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగరంలో కాలుష్యం, జంతువుల కళేబరాలు, మనుషుల శవాలతో ఆ నీళ్లు వారికి ప్రాణాంతకంగా మారాయి. ఆ ప్రాంతంలో పండిన పంటలు, బోర్లలో నీళ్లు కూడా పిల్లలపైన విపరీతమైన ప్రభావం చూపిస్తున్నాయి. ఆ సమస్యల నుంచి స్థానికులకు విముక్తి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

మూసీలో శుభ్రమైన నీరు ప్రవహించేలా గోదావరి జలాలు తెస్తున్నాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు. 'మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవ్వరికీ నష్టం చేయం. నిరాశ్రయులను చేయం. పునరావాసం కల్పిస్తాం. మెరుగైన వసతులు ఏర్పాటు చేసి తరలిస్తాం. ప్రాజెక్టును నిర్మిస్తూనే అక్కడ నష్టపోయే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పిస్తాం. బఫర్ జోన్‌లో ఉండే వారికి ఏ రకంగా సహాయం అందించాలో అందిస్తాం. రాజకీయ ప్రయోజనాల కోసం మిమ్మల్ని ఉసిగొల్పే వాళ్ల ఉచ్చులో పడొద్దు. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో అపోహలు సృష్టించకూడదు. అందరం కలిసి హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసుకుందాం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ సోమవారం శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు సీఎం సుదీర్ఘంగా సమాధానమిచ్చారు.

'మూసీ ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన నుంచి బయటకు రండి. ముందుకు తీసుకెళ్లడానికి సలహాలు ఇవ్వండి. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రారంభించింది తామే అని సిరిసిల్ల ఎమ్మెల్యే చెప్పారు. మూసీ నది వెంట 50 మీటర్ల బఫర్ జోన్ కూడా మీరు నిర్ణయించిందే. మీరు ప్రారంభించి అర్థాంతరంగా వదిలేసిన పనినే మేం ముందుకు తీసుకెళుతున్నాం. ఈ విషయంలో మీరు ఏ సూచన చేసినా పరిగణనలోకి తీసుకుంటాం.

ప్రజలకు ఉపయోగపడేవి అయితే 100% అమలు చేస్తాం. నాకు సూచనలు ఇవ్వడానికి ఏదైనా ఇబ్బంది ఉంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కేబినెట్ సబ్ కమిటీ వేస్తాం. ఆ కమిటీకి మీ సూచనలు చెప్పొచ్చు. 'గాందీసరోవర్ నిర్మించేందుకు 98 ఎకరాల రక్షణ శాఖ భూమిని కేంద్రం ఇస్తుంది. టూరిజం శాఖ దగ్గర ఇంకో 100 ఎకరాలు ఉన్నాయి. ఆ అపార్ట్‌మెంట్‌ల (మధుపార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌ల అంశాన్ని ఉద్దేశించి) భూమి తీసుకోకపోయినా పరవాలేదు. కానీ ఆ అపార్ట్‌మెంట్‌లలో ఉండే మిత్రులు 200506లో 9 మీటర్ల బఫర్ జోన్ చూపించి అనుమతులు తీసుకున్నారు. అయితే 2016లో మూసీ బఫర్ జోన్ 50 మీటర్లు అయ్యింది. ఆ ప్రకారం మార్క్ చేస్తే సగం అపార్ట్‌మెంట్‌లు బఫర్ జోన్‌లో ఉంటాయి. భవిష్యత్తులో వాటిని అమ్ముకోవడానికి వీలుకాదు. అందువల్ల నష్టం జరుగుతుందని మాత్రమే చెబుతున్నాం. మీకు ఇష్టమైతే, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం ఆ భూమిని ఇప్పుడు ఇస్తే నష్టపరిహారం ఇస్తాం. ప్రత్యామ్నాయం చూపడానికి కూడా అభ్యంతరం లేదు. 'ప్రజల సౌకర్యం కోసం ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి ఉన్న సమయంలోనే హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు సదుపాయం వచ్చింది. ఆనాడు దేశంలో రెండో స్థానంలో ఉన్న మన మెట్రో గత పదేళ్లలో నిర్లక్ష్యంతో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ అనుకూలంగా లేకపోవడంతో మెట్రోను రూ.15 వేల కోట్లు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం స్వాదీనం చేసుకుంటోంది.

ఏప్రిల్ వరకు ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత లాస్ట్‌మైల్ కనెక్టివిటీ వచ్చేలా మెట్రో రైలును నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టుకు, గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట, రాయిదుర్గం నుంచి నియోపోలీస్ వరకు మొత్తం 76 కిలోమీటర్ల మార్గాన్ని రూ.24 వేల కోట్లతో నిర్మించేందుకు అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయి. మెట్రో విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా ఉంది. 'హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు..

రోడ్లను అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్ అని మూడు రకాలుగా అభివృద్ధి చేస్తున్నాం. బేగంపేట్ ఎయిర్‌పోర్టు మధ్యలో రన్‌వే కింది నుంచి అండర్‌పాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి తెచ్చాం. పనులు జరుగుతున్నాయి. దేశంలో ఇలాంటి రోడ్డు ఎక్కడా లేదు. నల్లగొండ, విజయవాడ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్లను జూలై వరకు పూర్తిచేస్తాం. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలనుకుంటున్నాం. ఫుట్‌పాత్ వ్యాపారులకు ఎక్కడైనా స్థలాన్ని కేటాయించి ప్రోత్సహిస్తాం. మల్టీలెవల్ పార్కింగ్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నాం..' అని సీఎం తెలిపారు.

## 'జల్ జీవన్ మిషన్ 2.0పై కేంద్రంతో
## ఏపీ ప్రభుత్వం ఎంఓయూ...

ఎన్నికల హామీల్లో ఇది కూడా ఒకటన్న చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ (జేజేఎం) 2.0' అమలు కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 'హర్ ఘర్ జల్' (ప్రతి ఇంటికి కుళాయి నీరు) లక్ష్యాన్ని సాకారం చేసేలా కేంద్రం, ఏపీ మధ్య ఈ ఒప్పందం జరిగింది. ఢిల్లీలోని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరుకాగా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ ద్వారా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అశోక్ కుమార్ మీనా, ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. జల్ జీవన్ మిషన్‌ను 2028 వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రతి ఇంటికి సురక్షితమైన, స్థిరమైన తాగునీటిని అందించాలనేది మా ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇది కూడా ఒకటి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు" అని అన్నారు. ఇదే సమయంలో, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వర్చువల్‌గా మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జేజేఎం 2.0కు అనుమతి ఇచ్చామని తెలిపారు. "ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై ప్రధాని మోదీతో సంప్రదించారు. ఈ మిషన్ పొడిగింపు కోసం ఆయన చేసిన ప్రతిపాదనకు ధన్యవాదాలు. మొదటి దశలో 16 కోట్ల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. మిగిలిన 3 కోట్ల ఇళ్లకు సురక్షిత నీటిని అందించాల్సి ఉంది" అని ఆయన వివరించారు. ఏపీలో నీటి నాణ్యతను పరీక్షించేందుకు డ్వాక్రా మహిళల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ తాజా ఎంఓయూతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు ఏపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించనుంది. త్వరలోనే ఏపీలోని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసి, ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించుకుందామని కేంద్ర మంత్రి పాటిల్ తెలిపారు. జల్ జీవన్ మిషన్ విజయవంతానికి కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, దీనిని ఏపీ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2047 నాటి 'వికసిత భారత్' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు చేరడం అత్యంత కీలకమని ఆయన నొక్కిచెప్పారు.

# అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

మొదటి పేజి తరువాయి

ఇది కేవలం ప్రమాదమా లేక ఎవరైనా కావాలని చేస్తున్న కుట్రనా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

సీఎం చంద్రబాబు వ్యక్తం చేసిన ప్రధాన సందేహాలు

రాజధాని ప్రాంతంలో గత కొద్ది రోజులుగా మూడు సార్లు ఇలాంటి ప్రమాదాలు జరగడం యాదృచ్ఛికం కాదని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన నిర్మాణ సామగ్రి కాలిపోవడం వెనుక ఏదైనా లోతైన కుట్ర ఉందేమో తేల్చాలని చెప్పారు. వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కూడా గతంలో ఇలాగే పైపులు అగ్నికి ఆహుతయ్యాయని, ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయని, ఇది ఉద్దేశపూర్వక చర్యగా కనిపిస్తోందని అధికారులు ప్రాథమిక సమాచారం అందించారు. సీఆర్డీఏ అధికారులు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాజధాని ప్రాంతంలో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేసేలా ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

రాయపూడిలో అసలేం జరిగింది?

అఖిల భారత సర్వీస్ అధికారుల కోసం నిర్మిస్తున్న నివాస సముదాయాల సమీపంలో నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా తగులబడ్డాయి. ఆకాశాన్ని అంటేలా ఎగిసిపడిన మంటలను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది.

# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం



అమరావతి: ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకుస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## మోదీ నిర్ణయాధికారంపై ట్రంప్ కు
## కూడా అవగాహన ఉంది: రాహుల్ గాంధీ వ్యంగ్యం

ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భారతదేశ విదేశాంగ విధానం పూర్తిగా బలహీనపడిందని, జాతీయ ప్రయోజనాలకు బదులుగా అది ప్రధాని "వ్యక్తిగత విదేశాంగ విధానం"గా మారిపోయిందని ఆయన ఆరోపించారు. మంగళవారం నాడు పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే. ఈ విషయం అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది" అని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ నిర్ణయాధికారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి ప్రపంచ నాయకులకు కూడా అవగాహన ఉందని ఆయన ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ప్రధాని చేసిన ప్రసంగం అసంబద్ధంగా ఉందని, దేశ ప్రధాని హోదాకు తగ్గట్లుగా అది లేదని విమర్శించారు. ప్రభుత్వ విధానాల వల్ల రాబోయే రోజుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారని రాహుల్ హెచ్చరించారు. "ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఎల్‌పీజీ, పెట్రోల్, ఎరువులు.. ఇలా అన్నింటి ధరలు పెరిగి ప్రజలు నష్టపోతారు" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ, ఆ మహమ్మారిని ఎలా ఎదుర్కొన్నారో వారు మర్చిపోయారని విమర్శించారు. బుధవారం జరగనున్న అఖిలపక్ష సమావేశాన్ని స్వాగతించినప్పటికీ, కేరళలో ముందే ఖరారైన కార్యక్రమం ఉన్నందున తాను హాజరు కాలేనని రాహుల్ స్పష్టం చేశారు. "అమెరికా, ఇజ్రాయెల్ ఏం చెబితే ప్రధాని మోదీ అదే చేస్తారని నేను రాసివ్వగలను. ఆయన ఎప్పటికీ భారత ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోలేరు" అని రాహుల్ గాంధీ తీవ్రంగా ఆరోపించారు. ఇదే విషయాన్ని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో కూడా పోస్ట్ చేశారు.

# మతం మారితే ఎస్సీ, ఎస్టీ హోదా రద్దు..

మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మత మార్పిడి తర్వాత కూడా పాత కుల హోదాను కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ హోదా అనేది కేవలం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలకు చెందిన వారికే వర్తిస్తుందని ధర్మాసనం గుర్తు చేసింది. చారిత్రకంగా ఎదుర్కొన్న సామాజిక వెనుకబాటుతనం, అంటరానితనం వంటి తీవ్రమైన వివక్ష ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఒక వ్యక్తి వేరే మతంలోకి మారినప్పుడు, అతను ఆ మతంలోని సామాజిక నిర్మాణంలోకి వెళతాడని, పాత కులంతో ముడిపడిన వివక్షకు గురయ్యే అవకాశం ఉండదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు నేపథ్యంలో, ఇకపై మత మార్పిడి చేసుకున్న ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో జనరల్ కేటగిరీ కిందనే పరిగణించబడతారు. వారికి ప్రత్యేక రిజర్వేషన్ ప్రయోజనాలు లభించవు. చట్ట ప్రకారం మతం మారడం అంటే, ఆ వ్యక్తి తన పూర్వపు కుల మూలాలను వదులుకున్నట్లేనని కోర్టు తేల్చి చెప్పింది. ఈ తీర్పు రిజర్వేషన్ల అమలుపై భవిష్యత్తులో గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనివల్ల రిజర్వేషన్ల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని కొందరు భావిస్తుండగా, మతం మారినంత మాత్రాన వ్యక్తుల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మార్పు రాదని, వారికి రిజర్వేషన్లు కొనసాగించాలనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

## అమెరికా మా షరతులకు అంగీకరిస్తేనే యుద్ధం ఆగుతుంది

ఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌లోని ఇంధన మౌలిక సదుపాయాలపై పక్కా ప్రణాళికతో చేయాలనుకున్న సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, అమెరికా మెత్తబడినప్పటికీ ఇరాన్ మాత్రం తన వైఖరిని స్పష్టం చేసింది. తమపై విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేసి, జరిగిన నష్టానికి పరిహారం చెల్లించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేసింది. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. "గత రెండు రోజులుగా ఇరాన్‌తో జరిపిన చర్చలు ఫలవంతంగా సాగుతున్నాయి. ఈ చర్చల స్ఫూర్తితో ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై చేపట్టాల్సిన సైనిక దాడులను 5 రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ట్రంప్ పేర్కొన్నారు. చర్చల పురోగతిని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఇరాన్ సుప్రీం లీడర్ సైనిక సలహాదారు మొహ్సెన్ రెజాయీ స్పందించారు. 'న్యూస్18' కథనం ప్రకారం... "మాపై విధించిన ఆంక్షలు పూర్తిగా ఎత్తివేసి, మాకు జరిగిన నష్టాన్ని పరిహారంగా చెల్లించే వరకు యుద్ధం కొనసాగుతుంది" అని ఆయన అన్నారు. అంతేగాక ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోదని అంతర్జాతీయ హామీ కూడా కావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య శాంతి స్థాపన ప్రక్రియ సంక్లిష్టంగానే ఉందని స్పష్టమవుతోంది.

## ఆంబోతుల కొట్లాటలో సామాన్యులే బలి: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో గన్‌పార్కు వద్ద కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో వినూత్నంగా నిరసన తెలిపారు. అంతర్జాతీయ పరిణామాల సాకుతో సామాన్యులకు సిలిండర్లు దొరకకుండా చేస్తున్నారని, గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని అబద్ధాలు చెబుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ తమ పరిధిలో లేదని తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. వీరిద్దరి వైఖరి "ఆంబోతుల కొట్లాటలో లేగదూడలు బలైనట్లు" సామాన్య ప్రజల పాలిట శాపంగా మారిందని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ బరువును 14 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని, ఇది ప్రజల జేబులకు చిల్లు పెట్టడమేనని ఆయన ఆరోపించారు. గ్యాస్ సరఫరాపై నెలకొన్న అయోమయాన్ని తొలగించేలా ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని కొరత తీర్చాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను
## సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందన్న డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని కేటీఆర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల సమయంలోనైనా నిధులు విడుదల చేయాల్సిందిపోయి, ప్రశ్నించిన గొంతుకలపై ఉక్కుపాదం మోపడం రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించాల్సిన దుస్థితిని కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలని హితవు పలికారు. విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో 127 మంది విద్యార్థులు మరణించినా ముఖ్యమంత్రిలో కనీస చలనం లేదని, ఇప్పటివరకు దానిపై స్పందించకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బకాయిపడ్డ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలోనైనా నిలబెట్టుకోవాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్‌వి నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## నగిరి లో ఈరోజు మండల తాసిల్దార్ గారికి నగిరిలోయున్న భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు



నేడు శుభోదయ, చిత్తూరు జిల్లా :పెద్ద ఎత్తున ప్రజల సమీకరిం చుకొని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు వాగ్దానాల ను నివర్తించడంలో విఫలమైనందున దానికి సంబంధించి వారు ఎన్నికల్లో చెప్పిన విధంగా పేదవారికి టిట్కోయిన్లు మరియు మునిసిపాలిటీలో ఉన్న పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకొనుటకు రుణ సౌకర్యము మరియు పంచాయితీలో ఉన్న పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకున్నటకు రుణ సౌకర్యము కల్పిస్తాము అని చెప్పడం జరిగింది మరియు మహిళలకు ప్రతి ఇంటిలో ఎన్ని మంది ఉంటే అన్ని మందికి అంచలు లేకుండా నెలకు 1500 ఇస్తామని చెప్పడం జరిగింది మరియు ఎస్టీ ఎస్టీ మైనార్టీలకు 50 సంవత్సరాలకే 4000 పెన్షన్ ఇస్తామని చెప్పినారు మరియు వితంతువులకు బాధ్యత చనిపోయిన మరుసటి నెల 4000 పెన్షన్ ఇస్తామన్నారు ఇదివరకు ఒక్కటి కూడా అమలు చేయలేదు దీనికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలను అమలు చేయాలని నగిరి మండల తాసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఇల్లు లేని పేదలు మరియు పెన్షన్ అర్హత ఉండి రానివారు సిపిఐ పార్టీ నాయకులు వేలన్ సబీర్ భాష శ్రీనివాసులు విజయ్ కుమార్ రాజేంద్రన్ గోపాల్ మరియు నాయకులు పాల్గొనడం జరిగింది

## గోకవరం లో ప్రపంచ టి.బి.దినోత్సవం




గోకవరం-నేటిసుబోదయ.:మండల కేంద్రమైనా గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి నందు సూపరిండెంట్ డాక్టర్. రామలక్ష్మి అధ్యక్షతన ఆసుపత్రి వైద్యులు డాక్టర్. పవన్ దత్త, డాక్టర్. అభినవ్, డాక్టర్. మౌనిక, డాక్టర్. వైశాలి సమక్షంలో ప్రపంచ టి . బి.డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, కొత్తపల్లి పి హెచ్. సి వైద్య సిబ్బంది ర్యాలీని నిర్వహించారు.ఈకార్యక్రమాన్ని డాక్టర్. పవన్ దత్త ప్రారంభించి విద్యార్థులకు అవగాహన కల్పించి "అవును మనం టి. బి ని ముగించగలం" అనే ఈ ఏడాది నినాదంతో ముందుకు వెళ్లాలని టి. బి. ని నియంత్రిశించడంలో ప్రతీ ఒకరి భాగస్వామ్యం కావాలని తెలిపారు. టి. బి అనుమానిత లక్షణాలు కనబడగానే దగ్గరలోనున్న ప్రభుత్వ ఆసుపత్రిలో కళ్లె పరీక్ష చేయంచు కోవాలన్నారు. ఈ ర్యాలీ గోకవరం ఆసుపత్రి నుండి దేవి చౌక్ సెంటర్ వరకు టి.బి ని అరికడతాం, నిర్మూలిస్తామని వివిధ నినాదాలతో ర్యాలీగా వెళ్లి దేవి చౌక్ సెంటర్ నందు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాస్, ఏ.అరుణ, పిట్టా అరుణ్,హెడ్ నర్స్ విమల, ఎన్. సి. డి, సి. డి స్టాఫ్ నర్స్ లు,హెచ్. వి. రాజేశ్వరి టి. బి యూనిట్ ఎల్. టి. దేవి, ఏమ్. ఎల్. హెచ్పిలు అరుణ, అనూష,పవన్, శ్రీనివాస్, ఏ. ఎన్. ఎమ్ లు అమ్మాయి, నాగరత్నం, బాపనమ్మ, విశ్వనాథం, ఆశాలు, రాజా స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

## వీరవెంకట రమణ,దేవికి ఉత్తమ సేవా పురస్కారం



గోకవరం-నేటిసుబోదయ.:గోకవరం మండలం నందు ప్రపంచ టి. బి.దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వైద్య ఆరోగ్య శాఖాధికారి, తూర్పు గోదావరి జిల్లా క్షయ నియంత్రణాధికారి వారి చేతులమీదుగా ఉత్తమ సేవలకు గాను జి. కొత్తపల్లి పి. హెచ్. సి హెల్త్ అసిస్టెంట్ గంద్రెడ్డి వీర వెంకట రమణ కు సామాజిక ఆరోగ్య కేంద్రం లో టి .బి సెక్షన్లో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేయుచున్న దేవి కి ప్రసంశా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సి.హెచ్.సి సూపరిండెంట్ డా.రామలక్ష్మి జి. కొత్తపల్లి పి. హెచ్. సి వైద్యులు డా. తిరన్, డా. నిఖిత వైద్యసిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలలో 1,03,507అవకతవకలు



గోకవరం-నేటిసుబోదయ. :మండల కేంద్రమైన గోకవరం మండల పరిషత్ కార్యాలయం నందు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గోకవరం మండలంలోని 2024 నుండి 2025 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ తనిఖీల్లో 14 గ్రామపంచాయతీలలో జరిపిన పనులకు సామాజిక తనిఖీ డ్వామా పిడి ఏ నాగమహేశ్వరరావు, ఏపీడి రాంప్రసాద్, జిల్లా విజిలెన్స్ అధికారిణి పి రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో 894 పనులకు గాను 15.77 కోట్లు, పంచాయితీ రాజ్ మెటీరియల్ పనులకు గాను 9.23 కోట్లు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో 8 పనులకు గాను 11.35 లక్షల పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఒకటి మార్చి 2024 నుండి 31 మార్చి 2025 వరకు చేపట్టిన ఉపాధి హామీ, పంచాయతీరాజ్ మెటీరియల్ పనులలో 1,03,507రూపాయలు అవకతకులు జరిగినట్లు తెలిపారు. ఈ సొమ్ములు వెంటనే రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం గోవిందు, ఏవో శ్రీనివాసరావు, ఏపీవో పిఎస్ అప్పలరాజు, ఎస్ ఆర్ పి కే వెంకటరమణ, మండల ఇంజనీరింగ్ అధికారులు, సామాజిక తనిఖీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సేల్స్ టాక్స్ వృత్తి పన్ను శాఖ అధికారులచే అవగాహన సదస్సు




యాడికి మార్చి 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ; మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి శాలలో జీఎస్టీ రవి ఆధ్వర్యంలో సేల్స్ టాక్స్ వృత్తి పన్ను శాఖ అధికారులచే అవగాహన సదస్సు మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వ్యాపారస్తులందరూ పాల్గొన్నారు. 40 లక్షల రూపాయల సంవత్సరం టర్నోవర్ ఉంటే కచ్చితంగా జిఎస్టి తీసుకోవాలని అంతకన్నా తక్కువ ఉంటే కాంపొజిషన్ తీసుకుని గవర్నమెంట్ కు మూడు నెలలకు ఒకసారి టాక్స్ లు కట్టాలని టాక్స్ కట్టకపోతే మీ దగ్గర ఉన్న డబ్బంతా బ్లాక్ మనీ అవుతుందని బ్లాక్ మనీ తో మీ డబ్బులు లకు మీ హక్కు ఉండదని మీరు ఏమి చేయలేరని అదే గవర్నమెంట్ టాక్స్ కట్టి ఆ డబ్బులను వైట్ మనీ గా చేసుకుంటే గవర్నమెంట్ పరంగా అది మీ డబ్బు అవుతుందని ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఏవైనా రాజమార్గంలో



వ్యాపారాలు కానీ బ్యాంకు డిపాజిట్లు గాని చేసుకోవచ్చని తెలిపినారు ఇంకా మీకు ఏవైనా సమస్యలు ఉంటే మాకు చెప్పాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సి టి ఓ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి, డి సి టి ఓ శ్రీనివాసులు, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యాడికి మండల వ్యాపారస్తులు, కిరాణా వ్యాపారస్తులు, క్లాత్ బిజినెస్ వారు,పట్టు చీరల వ్యాపారస్తులు పాల్గొని సమస్యలు తెలియజేశారు. అధికారులు వారి సమస్యలకు చట్టపరంగా పరిష్కరిస్తామని తెలిపారు...

## అందరూ అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండాలి

: టి.ధనంజయ రెడ్డి



తేదీ:24.03.2026. నారాయణవనం నేటి శుభోదయం: సవ సమాజ స్థాపనకు ఆర్థికశీ గాను,సామాజికశీ గాను,నాయకత్వపరంగాను, కుటుంబాభివృద్ధికి సహకారం అందిస్తూ అప్రమత్తతతో ఉండాలని సెర్ప్ సహయ ప్రాజెక్టు అధికారి టి. ధనంజయ రెడ్డి సూచించారు. నారాయణవనం మండల మహిళా సమాఖ్య కార్యాలయం లో మంగళవారం మండల సమైక్య సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశం లో ఆయన మాట్లాడుతూ కుటుంబశీ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి కి వివిధ రకాల జీవనోపాదులు చేపట్టాలని తెలిపారు.ఆదర్శ సంఘాలు తయారు చేసుకొని కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకురావాలన్నారు. వీటిపై తరచుగా సంఘాల్లో చర్చించేందుకు లీడర్లు, జెండర్, హెల్త్ పాయింట్ పర్సన్స్,ఈ నారీ, సి ఆర్ పి ల సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. వారు మహిళాభి వృద్ధికి మహిళా సంఘాలు, గ్రామ, మండల సమాఖ్యలతో అనుసంధానమై పని చేయాలన్నారు. వివిధ శాఖలకు సమన్వయంతో ఆరోగ్యం, విద్య, వైద్యం,నీరు,పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలలో అవగాహన కల్పించాలని సూచించారు. స్త్రీలకు పురుషులకు మధ్య ఉన్న అసమానతలను తెలియజేసి సమానత్వం తీసుకురావాలని సూచించారు. నిస్సహాయ మహిళలకు ఆసరాగా నిలిచి ధైర్యం కల్పించాలని కోరారు. వి ఓ స్థాయి లో బాల్య, యవ్వన, మధ్య, వృద్ధాప్య వయసులో మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలను తెలిపి వాటి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. ఇతర శాఖల సమన్వయంతో ఆర్థిక అక్షరాస్యత, దురలవాట్లు రూపుమాపడంపై చైతన్యం కలిగిస్తూ, పౌష్టికాహారం పొందుటకు పెరటి తోటల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తులను భుజించడం, అలవాటుల్లో మార్పు తీసుకొచ్చే కార్యక్రమాలను చేపట్టవలెనన్నారు. ఈ సందర్భంగా మహిళలకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, తెలియని లింకులు ఓపెన్ చేయడం, ఆర్థిక అక్షరాస్యత, మొబైల్ ఫోన్లు సోషల్ మీడియా వినియోగం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలు, గృహ హింస, మహిళలపై జరిగే నేరాలు, మహిళల అక్రమ రవాణా, ఆన్లైన్ మోసాలు, డ్రగ్స్ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ప్రస్తుత సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న వివిధ ఘటనలను ఉదాహరణలతో వివరిస్తూ, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లను కూడా తెలియజేశారు. ఎం ఎస్ అధ్యక్షురాలు పి. రామతులసి గ్రామసమైఖ్యల పనితీరు పై సమీక్షించి ప్రజల ఆరోగ్యం పోషణ, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తెలియజేశారు.మానవ అభివృద్ధి సూచికలను మెరుగుపరిచేందుకు అన్ని అంశాలపై, అనునిత్యం సంఘాలలో అజెండాలు పెట్టి చర్చించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారు చేసే దానిలో భాగంగా ఐఐఎం విశాఖపట్నం వారి సహకారంతో ఇంకు బేటర్ సెంటర్ ఏర్పాటు చేసి సంపన్నకారిగా మహిళలను తీర్చిదిద్దేందుకు నెలకు లక్షపైన ఆదాయం పొందే వారిని ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. వారికి వివిధ రకాల సహకారాలను అందిస్తుందన్నారు. సంఘాల సమావేశంలో సంపన్నకారి కావడానికి మహిళల వ్యాపారాల పై అవగాహన పొందే విధంగాను, ఇతర అన్ని అంశాలను తెలిపేందుకు వి ఓ సబ్ కమిటీలు,వి ఓ ఓ బి, వి ఓ ఏ లు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెండర్ మరియు డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించడమైనది.ఈ కార్యక్రమశీలో ఏపిఎంలు టి.ధనంజయ రెడ్డి, బి. సుదర్శన్ రాజు,,సి సి లు అరుణ్ కుమార్, నిమ్మి,నాగేంద్ర రావు, రాజేశ్వరి, ఎం ఎస్ అధ్యక్షులు పి.రామ తులసి, కార్యదర్శి శాంతి, కోశాధికారి జ్యోతి, అకౌంటెంట్ మల్లిక,ఎమ్ ఎస్,వి ఓ అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

## పిఆర్సి, మధ్యంతర భృతి ప్రకటించాలిలి - యుటిఎఫ్ డిమాండ్




నేటి శుభోదయలిచిత్తూరు జిల్లా నగిరి :12వ పిఆర్సీ అమలు, పెండింగ్ డిఏ ల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని తాలూకా కేంద్రాలలో ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ మణిగండన్ తెలిపారు.మంగళవారం ఉదయం యుటిఎఫ్ నగిరి నియోజకవర్గం ఆధ్వర్యంలో జరిగిన నగరి స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద జరిగిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడుతూ రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ అన్ని తాలూకా కేంద్రాలలో ఒకరోజు నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు.12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లవుతున్నా , పిఆర్సీ అమలుకు ప్రయత్నించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. వైసీపీ హయాంలో నియమించిన పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ తన బాధ్యతలకు రాజీనామా చేసినప్పటికీ నూతన చైర్మన్ ను నియమించకపోవడం తగదన్నారు.తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేయడంతో పాటు,ఆర్థిక బకాయిలన్నిటినీ ఆరు మాసాలలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వైపుగా కనీసం ఆలోచించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు.ఆర్థిక బకాయిల చెల్లింపులపై రోడ్డు మ్యాప్ ప్రకటించి డి.ఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు నాలుగు డిఏలు చెల్లించాల్సి ఉండగా, ఒక్క డిఏ మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. సరెండర్ లీవ్ బకాయిలను నాలుగేళ్లుగా చెల్లించడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తిరుపతి జిల్లా సహాధ్యక్షులు ఈ గీతమ్మ గారు మాట్లాడుతూ తక్షణం నూతన పిఆర్సీ ని ఏర్పాటుచేసి, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలనని డిమాండ్ చేశారు జిల్లా కార్యదర్శి కే వంశీకృష్ణ మాట్లాడుతూ మెమో నెంబర్ 57 అమలు చేయాలని,పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ పరిష్కరించాలని, బకాయి పడ్డ సరెండర్ లీవ్ లు చెల్లించాలని, ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించిన మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్ పూర్వ రాష్ట్ర కౌన్సిలర్లు పిఆర్ మునిరత్నం కుప్పరాజు మరియు జిల్లా నాయకులు జయరాజ్ నరేష్ రవీంద్రబాబు, కొలతూరు భాస్కర్, జాన్, మహిళా ఉపాధ్యాయునులు,సంఘీభావంగా సిపిఐ దేశ నాయకులు నారాయణ గారు, ప్రాంతీయ బిఎస్పి నాయకులు,ఉపాధ్యాయులు, నగిరి నియోజకవర్గం మండలాల ప్రాంతీయ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలకు ఒక వందల ఎకరాల దోచిపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు వాడు వెనకాడుతున్నది



నేటి శుభోదయ చిత్తూరు జిల్లా నగిరి :సిపిఐ పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ అధ్యక్షులు కామ్రేడ్ నారాయణ. ఈరోజు రాష్ట్ర సిపిఐ పార్టీ పిలుపుమేరకు నాగరిలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు ర్యాలీ అనంతరం ఆర్డీవో కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది... ...ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని సంఘం భావం సంఘీభావం తెలిపిన సిపిఐ పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ గారు....ఎన్నికల్లో వాగ్దానలను అమలు చెయ్యడంలో గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి. సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకే నగరి టవర్ క్లాక్ నుంచి ర్యాలీగా వచ్చి ఆర్డిఓ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది.. సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి అధ్యక్షత వహించారు.. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన ఇంటి స్థలాల హామీని అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇస్తానని ఎన్నికల వాగ్దానం చేసి రెండు సంవత్సరాలు గడిచినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇవేమి పట్టించుకోవడం లేదన్నారు. సి యం చంద్రబాబు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు సిపిఐ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసి 15 సంవత్సరాల అవుతున్న కనీసం వాళ్లకి నివాసం ఉన్న ఇండ్లకు కూడా పట్టాలు ఇవ్వలేదని వెంటనే కలెక్టర్ గారు ఆర్టీవో గారు ఎమ్మార్వో గారు స్పందించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు నగరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో అర్హులైన వారికి నివాసన్న ఇండ్లకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్య మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ కార్మికులకు స్వీపర్స్ కాలనీ ఉన్నాయని ఒక నగిరి లోనే స్లిప్పర్స్ కాలనీ లేదని కావున ఎమ్మార్వో గారు బాధ్యత తీసుకొని శ్రీ పర్స్ కాలనీ ఏర్పాటు చేయాలని ప్రతి వారికి ఇంటి స్థలాలు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం ఆర్డిఓ గారు లేనందున నగిరి ఎమ్మార్వో గారు వచ్చి వినతి పత్రం తీసుకొని కచ్చితంగా అందరికీ పట్టాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి పార్టీ నాయకులు మురళి శరవుద్దిన్ యేసయ్య, రాజేంద్రన్ సతీష నాగరాజు అర్జున ఎఐటియుసి నాయకులు పార్వతి కుట్టి సంపూర్ణ ఏడవ వార్డు నాయకులు హేమలత సుమతి నిర్మలా సెల్వం ఢిల్లీ బాబు తొమ్మిదవ వార్డ్ నాయకులు అశ్విని మేరీ సురేష్ పాల్గొన్న మున్సిపల్ వర్కర్స్ 7 9 10 వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు......

## వసంత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శ్రీ కనక దుర్గమ్మ వారి సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనక దుర్గమ్మ వారికి ఆరో రోజు పుష్పార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన కాగడ మల్లెలు, మరువం, జాజులు, చామంతి వంటి సుగంధ భరితమైన పూలతో ప్రత్యేక అలంకరణ చేసారు. ఈ సుగంధభరితమైన పుష్పాల అలంకరణలో దుర్గమ్మను దర్శించుకోవడం భక్తులకు కంటికి ఇంపుగా, మనస్సుకు ప్రశాంతతను ఇచ్చే అద్భుతమైన అనుభూతిని చెందామని భక్తులు తెలిపారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పుష్పార్చన సమయంలో దేవాలయం పరిసరాలు పూల వాసనలతో సుగంధభరితంగా మారాయి. ఈ పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు సుఖసంతోషాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తారని భక్తుల నమ్మకం.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేత



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తెనాలికి చెందిన మాదాల నాగరాజా కుమారి, భాను ప్రసాద్ దంపతులు చైర్మన్ రాధాకృష్ణ కు బంధువులు అయిన వీరు రూ. 1,00,116/- రూపాయలను విరాళంగా సంబంధిత ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్న కూటమి ప్రభుత్వం

: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- ఏపీ రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బలమైన పునాదులు వేస్తోందని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.మైలవరం మండలంలోని పొందుగల గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు 36 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 12 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రహదారిని ప్రారంభించారు. తొలుత గ్రామంలో శివాలయంలో స్వామివారిని, దేవతా మూర్తులను దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనకాపల్లిలో స్టీల్ ప్లాంట్ ద్వారా ఏపీకి రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా దార్శనికులు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మార్చి నెలలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని అమలు, 10 వేల పోస్టులతో భారీ జాబ్ క్యాలెండరు, ఏటా డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ఇమామ్లు, మౌజన్ల వేతనాలు రూ.45 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అయిన స్త్రీ శక్తి, తల్లికి వందనం, దీపం 2.0, అన్నదాత సుఖీభవ, పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలను కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు.మైలవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు పేదల సంక్షేమ పథకాల అమలుకు ఇప్పటికి సుమారు 446.05 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. పల్లె పండుగలో భాగంగా.32.92కోట్లతో సీసీ రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సాకరమైన పేదల దశాబ్దాల కల.

### పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఆదేశాలతో పేదల దశాబ్దాల కల సాకారమైంది. మైలవరం మండలంలోని పోరాట నగర్లో పేదలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. వారి స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు లేవు. దీనివల్ల వారు ప్రభుత్వం నుంచి మంజూరు అయ్యే పక్కాగృహాలు మంజూరు కాక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు దృష్టికి తీసుకువచ్చారు. పేదలకు తక్షణమే పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీనిపై రెవిన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయగా వాటిని ఎమ్మెల్యే వసంత పోరాట నగర్లో మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. దీంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య ఇప్పుడు పరిష్కారమైందని పేదలు పేర్కొన్నారు. మొత్తం 60 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. వీరికి త్వరలోనే పక్కాగృహాలు కూడా మంజూరు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకంపై ఆకస్మిక తనిఖీ చేసిన

## గద్దె అనురాధ



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ మంగళవారం మధ్యాహ్నం విజయవాడ పశ్చిమలోని కాలేశ్వరరావు మార్కెట్ సమీపంలో గాంధీజీ మున్సిపల్ స్కూల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆమె, ప్రతిరోజూ అందుతున్న భోజన మెనూ, నాణ్యత, రుచిపై వివరంగా ఆరా తీసి విద్యార్థుల సంక్షేమంపై తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని మరోసారి చాటారు. విద్యార్థులకు స్వయంగా వడ్డించి, భోజనం రుచి గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా రంగంలో నాణ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పరిశుభ్రత, పోషకాహారం, నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాఠశాలలను స్వయంగా సందర్శిస్తూ భోజన నాణ్యతను పరిశీలించే విధానం వల్ల విద్యార్థులకు మెరుగైన ఆహారం అందడమే కాకుండా తల్లిదండ్రుల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. స్కూల్లో అందించిన భోజనం రుచికరంగా, పరిశుభ్రంగా ఉండటంపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ, వంట సిబ్బంది, పాఠశాల సిబ్బందిని అభినందించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండింటినీ సమానంగా ప్రాముఖ్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, వంటగది పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సిబ్బందికి సూచించారు. తల్లిదండ్రులతో సమన్వయం పెంచుకోవాలని, ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తూ ప్రభుత్వ పథకాల అమలు పారదర్శకంగా జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో నాసిరకం బియ్యంతో భోజనం అందించగా, నారా చంద్రబాబు నేతృత్వంలోని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నదని పేర్కొన్నారు. భోజన నాణ్యత లోపించిన కారణంగా గత వైసీపీ పాలనలో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని తెలిపారు. ప్రస్తుతం అందుతున్న భోజనంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతృప్తిగా ఉన్నారని, అందువల్లే విద్యార్థులంతా పాఠశాలలోనే భోజనం చేస్తున్నారని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నారని, ప్రభుత్వ పథకాల అమలు మరింత మెరుగుపడేలా కృషి కొనసాగుతుందని అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, స్కూల్ హెడ్ మాస్టర్ మల్లికార్జున రెడ్డి, పశ్చిమ నియోజవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు షేక్ నసీమా, ప్రధాన కార్యదర్శి పితాని పద్మ, 37 డివిజన్ అధ్యక్షులు మురళి, 37 డివిజన్ బూత్ కన్వీనర్ బోసు బాబు, 35 వ డివిజన్ అధ్యక్షురాలు షేక్ నందకుమారి, పశ్చిమ నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షులు మధురాంతకం సాయి చైతన్య, తెలుగు మహిళలు కసింకోట మల్లేశ్వరి, పుప్పాల దుర్గ, పట్నాల భార్గవి, ప్రియాంక శాంతి, మెండు జ్యోతి, లంకా బుజ్జి గౌరీ, సయ్యద్ అలీ తదితరులు ఉన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



నేటి శుభోదయ/ డోన్ నియోజకవర్గ ప్రతినిధి :డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలంలోని అలేబాద్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాల గురించి ఈ సందర్భంగా వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, ముఖ్యంగా పంచసూత్రాలు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాల ప్రయోజనాలను ఎమ్మెల్యే రైతులకు వివరించారు. అదనంగా రాయితీపై విత్తనాల పంపిణీ, ఎరువులు, పురుగుమందుల సరఫరా విధానాలపై సమగ్ర సమాచారం అందించారు. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# ఇంటి పన్ను తో పాటు నీటి డ్రైనేజ్ పన్నులు కూడా చెల్లించాలి

### వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- ఇంటి పన్ను తో పాటు నీటి, డ్రైనేజ్ పన్నులు కూడా చెల్లించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నీటి, డ్రైనేజీ పన్నులు చెల్లించని బకాయిదారులకు మంగళవారం ఉదయం వాటర్ ట్యాప్, డ్రైనేజ్ కనెక్షన్ డిస్కనెక్ట్ చేశారని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వన్ టౌన్, భవానిపురం, మధురానగర్ నాగేంద్ర నగర్, ఆటోనగర్ ప్రాంతాలలో పన్నులు చెల్లించని మొండి బకాయి దారుల గృహాలకు వాటర్ ట్యాప్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ డిస్కనెక్ట్ చేశామని అన్నారు. ఖాళీ స్థల పన్ను మొండి బకాయి దారులకు జెసిబి లతో రోడ్ కనెక్టివిటీని డిస్కనెక్ట్ చేశామని తెలిపారు.ప్రజలందరూ ఇంటి పన్నుతో పాటు నీటి పన్ను, డ్రైనేజీ పన్ను కూడా కట్టాలని, చాలామంది కేవలం ఇంటి పన్ను మాత్రమే కట్టి నీటి, డ్రైనేజీ పన్నులను చాలా సంవత్సరాలుగా కట్టకుండా ఉన్నారని అన్నారు. వారి జాబితాని తీసి వారికి ఎస్ఎంఎస్, రూపంలో సమాచారం అందించి, డిమాండ్ను తెలియపరుస్తున్నామని అన్నారు. సంవత్సరాల తరబడి బాకీ ఉన్న మొండి బకాయి దారులు వెంటనే బకాయిలు మొత్తం చెల్లించాలని, లేదా చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని కమిషనర్ అన్నారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కల్పించిన 50% వడ్డీ మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇంటి, ఖాళీ స్థల పన్ను బకాయిలు ఏక మొత్తంలో చెల్లించి 50% వడ్డీ మాఫీని పొందగలరని తెలిపారు ఈ అవకాశం ఈ నెల 31 వరకు మాత్రమే ఉంటుందని ప్రజలందరూ పన్ను చెల్లింపునకు నగర పరిధిలో గల అన్ని క్యాష్ కౌంటర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, అసిస్టెంట్ కమిషనర్లు ఏ యు బి శర్మ, హెలెన్,డి యస్ యస్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి: ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- సౌరశక్తి వినియోగంపై ప్రజలల్లో అవగాహన పెంపొందిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపేందుకు పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహనకు సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ), నెడ్ క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాంధ్ర ప్రగతి రథాలను విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం అశోక్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన కార్యక్రమం 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అని, ప్రతి ఇంటి పైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే అతి తక్కువ ఖర్చుతో మనం ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. మనకు అయ్యే ఖర్చు సుమారు 4 నుండి 6 ఏళ్లలో కరెంట్ బిల్లుల ఆదా ద్వారా తిరిగి వచ్చేస్తుందన్నారు. అనంతరం 20 ఏళ్ల పాటు మనం ఉచితంగా విద్యుత్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ రోజున ఏ ఇంటికి వెళ్లినా కరెంట్ బిల్లు ప్రధానమైన భారంగా మారుతోందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలుకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. ప్రకృతి నుంచి, సూర్యుడి నుంచి శక్తిని గ్రహించి సోలార్ ప్లేట్ల ద్వారా ఎనర్జీని ఇచ్చే గొప్ప కార్యక్రమం ఇది అని అన్నారు. దీనివల్ల కాలుష్యం కూడా ఉండదన్నారు. విద్యుత్ ప్లాంట్ల వల్ల బొగ్గు పొగ వల్ల వచ్చే కాలుష్యం మన ఊపిరితిత్తులపై ఎంత ప్రభావం చూపుతుందో మనం ఆలోచించుకోవాలన్నారు. ఈ పథకంలో క్రింద ప్రభుత్వం పలు సబ్సిడీలను అందిస్తోందన్నారు. 70 వేల నుండి 80 వేల వరకు ఖర్చయ్యే ప్లాంట్‌పై 30,000 సబ్సిడీ ఉంటుందన్నారు. షెడ్యూల్ కులాలు తెగల వర్గాలకు నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. వారికి ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. బీసీలతో పాటు అందరికీ ఇందులో సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. తన వ్యక్తిగత అనుభవానికి వస్తే తనకు గతంలో నెలకు వేల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లించేవాడినని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నాక ఇప్పుడు 4,000 నుండి 5,000 వరకు బిల్లు తగ్గిందన్నారు. ఇందుకు సుమారు 6 లక్షలు వరకు ఖర్చు చేశానన్నారు. దీనివల్ల నెలకు 18,000 చొప్పున ఏడాదికి లక్షకు పైగా ఆదా అవుతోందన్నారు. ఇలా మూడు నుండి నాలుగు సంవత్సరాలలో నేను పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేస్తుందన్నారు. నేను వ్యక్తిగతంగా లబ్ధి పొందాను కాబట్టి, ఒక శాసనసభ్యునిగా, ప్రజా ప్రతినిధిగా అందరూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మాట్లాడుతూ సూర్యాంధ్ర ప్రచార ప్రగతి రథాల ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్, నెడ్ కాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ మౌలాలి పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గంలో జరిగినవన్నీ జగన్ ప్రభుత్వ హయాంలోని పనులే

## మాజీ మంత్రి వెలంపల్లి



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావుకు తాజా మాజీ కార్పొరేటర్లు ఘనంగా కృతజ్ఞత సత్కారం నిర్వహించారు. మంగళవారం గాంధీనగర్‌లోని హోటల్ వివాన్ వేదికగా 2021-2026 కాలపరిమితికి ఎన్నికైన పశ్చిమ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తమ పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, తమకు కార్పొరేటర్లుగా సేవ చేసే అవకాశం కల్పించినందుకు వారు వెలంపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ వేడుకలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తన సతీమణి వెలంపల్లి శ్రీవాణితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేద పండితులు వెలంపల్లి శ్రీనివాసరావు దంపతులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్లు వారి కుటుంబ సభ్యులతో కలిసి వెలంపల్లి శ్రీనివాసరావు దంపతులను శాలువాలతో కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధిలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ తమకు వెన్నుముకగా నిలిచి నడిపించినందుకు వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో 22 డివిజన్లలో 19 డివిజన్లను వైసిపి గెలుచుకోవడం సామాన్య విషయం కాదని, ఇది కేవలం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అద్భుత నాయకత్వం వల్లే సాధ్యమైందని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని, రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో తాము చేపట్టిన సిమెంట్ రోడ్లు, వాటర్ ట్యాంకులు, పార్కులు మరియు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి పనులను ఆయన గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన కార్పొరేటర్లను ఆయన అభినందించారు. ఇతర పార్టీల నుంచి ప్రలోభాలు వచ్చినప్పటికీ, జగన్ మీద నమ్మకంతో పార్టీని వీడకుండా ఉన్న నాయకుల నిబద్ధత వెలకట్టలేనిదని ఆయన పేర్కొన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది సంపాదించడానికి కాదని, ప్రజలకు సేవ చేయడానికేనని స్పష్టం చేశారు. 2009 నుండి ఇప్పటివరకు తన ఆస్తులను పార్టీ కోసం, ప్రజా సేవ కోసం వెచ్చించాను తప్ప, రాజకీయాల ద్వారా ఒక్క రూపాయి కూడా సంపాదించలేదని ఆయన ఉద్ఘాటించారు. తన కుటుంబం, వ్యాపారాలు తనకు సంతృప్తిని ఇస్తున్నాయని, రాజకీయాలు తనకి ఒక బాధ్యత అని ఆయన తెలిపారు. అందరూ కలిసికట్టుగా ఉండి విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో కూడా పార్టీ అండగా ఉంటుందని, నమ్మకంతో పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల కాలంలో పశ్చిమ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, దానికి కార్పొరేటర్లందరి సహకారం, కృషి ఎంతో ఉందని కొనియాడారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధి పనులన్నీ జగన్ ప్రభుత్వ హయాంలో జరిగాయని ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వెలంపల్లి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుతం నియోజకవర్గంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్న పనులన్నీ గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో తాము మంజూరు చేయించినవేనని ఆయన స్పష్టం చేశారు. కొత్తగా ఈ ప్రభుత్వం ఒక్క పని కూడా మొదలుపెట్టలేదని, కేవలం పాత పనులకు రంగులు వేస్తూ క్రెడిట్ కొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రోడ్లు, నీటి ట్యాంకులు, పార్కుల అభివృద్ధి వంటివన్నీ తమ హయాంలోనే మ్యూనిసిపల్ కార్పొరేషన్ ద్వారా మంజూరయ్యాయని ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో కార్పొరేటర్ల బాధ్యత మరింత పెరిగిందని, నియోజకవర్గంలోని 22 డివిజన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వెలంపల్లి సూచించారు. "ఇంతకుముందు అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను పరిష్కరించాం, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి ప్రజల కోసం పోరాటం చేద్దాం" అని ఆయన నాయకులను, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. నియోజకవర్గంలో అవినీతి, దోపిడీ పెరిగిపోయాయని, రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో పైసలు ఇస్తే తప్ప పనులు జరగని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో వదిలి వెళ్ళిన వారిని, మోసం చేసిన వారిని తిరిగి పార్టీలోకి చేర్చుకునే ప్రసక్తే లేదని వెలంపల్లి స్పష్టం చేశారు. పదవులు ఉన్నప్పుడు అనుభవించి, లేనప్పుడు పక్కకు వెళ్ళిన వారు నిజమైన నాయకులు కాదని, జగన్ మోహన్ రెడ్డి సిద్ధాంతాలను నమ్మి పార్టీలోనే కొనసాగుతున్న వారే అసలైన వైఎస్ఆర్ సీపీ సైనికులని ఆయన కొనియాడారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని వెలంపల్లి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మళ్లీ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, గత రెండేళ్ల కూటమి పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తాజ మాజీ కార్పొరేటర్లు బండి పుణ్యశీల, బలసాని మణెమ్మ, షేక్ రెహమాతున్నీసా, యరడ్ల ఆంజనేయరెడ్డి, మొహమ్మద్ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటిరెడ్డి, గోదావరి గంగ, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 13వ డివిజన్‌లో 3 ప్లాట్‌పారమ్ బండ్లు, రెండు రిక్షాలు, ఒక ఇస్త్రీ బండిని అందచేసిన ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- తోటి వారికి సహాయం చేయడంలో నిజమైన ఆనందం కలుగుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. మంగళవారం ఉదయం తూర్పు లోని 13వ డివిజన్ జేడీ నగర్‌లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన ప్రజలను అడిగి తెల్సుకుని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం స్వయం ఉపాధి చేసుకునేందుకు మూడు తోపుడు బండ్లు, రెండు రిక్షా బండ్లు, ఒక ఇస్త్రీబండిని ఎమ్మెల్యే గద్దె తన సొంత నిధులతో కొనుగోలు చేసి నిరుపేద కుటుంబాలకు ఉచితంగా అందచేశారు. సాయిరమ, వై.చిన్నముడు, చెక్క మహాలక్ష్మిలకు తోపుడు బండ్లు, లాబెట్టి నాగార్జున, ఇప్పిలి వేలప్పుడులకు రిక్షా బండ్లు, కొడూరు జోగయ్యకు ఇస్త్రీ బండిని గద్దె అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ మఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ--4 పథకం గురించి ప్రతి వేదికపైన చెబుతున్నారన్నారు. పవిత్రమైన ఖురాన్, బైబిల్, భగవద్గీత చూసినా తోటి వారికి సహాయం చేయమనే ఉందన్నారు. దేవుడుకు పూజ, సేవ చేయడం కంటే తోటి వారికి సహాయం చేయడం మంచిందని చెప్పారు. తాను 30 సంవత్సరాలుగా ఇదే విధంగా సొంత నిధులతో తన వంతుగా పేదలకు సహాయం చేస్తున్నానని చెప్పారు. వైద్య సహాయం, పేద విద్యార్థులకు ఫీజులు, జీవనోపాధికి బండ్లు పంపిణీ చేస్తున్నానని అన్నారు. రిక్షా కార్మికుడు కూడా తాను రోజు వారి సంపాదనలో కొంత భాగం తోటి వారికి సహాయం చేసి పీ--4లో భాగం కావచ్చునని చెప్పారు. ఈ విధంగా ప్రతి ఒక్కరు తన దగ్గర ఉన్నంతలోనే తనకు తోచిన విధంగా సహాయం చేయాలని గద్దె అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ దవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ గద్దె ప్రసాద్, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, నూతి శ్రీను, కొర్రపాటి శ్రీను, ధూళిపాళ్ళ రాజేష్, వేములపల్లి శ్రీను, లోకేశ్వరరావు, యల్లబాబు, సొంటి నాగేశ్వరరావు, సింగంశెట్టి రమేష్, కర్ణ రమేష్, డాంగేకుమారి, తిరుమలశెట్టి నాని, మాదిరెడ్డి రవి, సాయిలక్ష్మి, హారిక, ముమ్మనేని రాజా, బాలరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పుడు జనగణన మరింత సులభం మీ వివరాలను మీరే నమోదు చేసుకోవచ్చు: ధ్యానచంద్ర



విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- ఈసారి జరిగే జనగణనలో ప్రజలు తమ వివరాలు తామే నమోదు చేసుకునే "స్వీయ గణన" సౌకర్యం ఉందని, దీని ద్వారా జనగణన మరింత సులభతరం అవుతుందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ ధ్యానచంద్ర అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ 2027 ఫిబ్రవరిలో జరిగే జన గణన లో భాగంగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారని, ప్రజల వివరాలు సేకరించడానికి మే 1 నుండి 30 వరకు సిబ్బంది వస్తారని అన్నారు. కానీ సిబ్బంది ప్రజల వద్దకు రాకముందే ప్రజలు తమకు తామే స్వీయ గణన చేసుకునే సౌకర్యం ఏప్రిల్ 15 నుంచి 30 వరకు ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ప్రజలు తమ వివరాలు ట్రయిల్ లో భాగం గా ఫ్రెజూం:?/వర్.ఎవఅంబం.స్త్రశీజ.అఅ/ఒవ/ లో నమోదు చేసుకొని స్వీయ గణనలో పాల్గొనవచ్చని అన్నారు.

# కమ్యూనిస్టు యోధులు కామ్రేడ్ వీకే వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి జాఫర్

### తృతీయ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



యాడికి మార్చి 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పేదల పక్షపాతి బడుగు బలహీన వర్గాల కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ వీకే వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి జాఫర్ పేర్కొన్నారు. మండలంలోని వేములపాడు గ్రామంలో కామ్రేడ్ వీకే వెంకటరామిరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు వికె ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం ఆవరణంలో , మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు అభిమానులు రైతులు కార్యకర్తలు కమ్యూనిస్టు యోధుడు దివంగత కామ్రేడ్ వీకే వెంకటరామిరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి అబ్దుల్ రజాక్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి జాఫర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సి జాఫర్ మాట్లాడుతూ కామ్రేడ్ వీకే వెంకటరామిరెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమంపై ఆకర్షితులై అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ లో క్రియాశీలకంగా పనిచేశారు యాడికి మండలంలోని వేములపాడు గ్రామ పంచాయతీ సర్పంచుగా సొసైటీ సింగిల్ విండో అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారని, భూస్వామ్య పెత్తందారులకు ఆ ప్రజాస్వామిక పాలకులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలలో ముందు వరుసలో నిలిచారన్నారు అమరజీవి కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి గారి స్ఫూర్తితో ఆ కుటుంబం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో భాగమైందన్నారు. మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదాతలు 72 మంది రక్తదానం చేశారు. అనంతరం స్వచ్ఛంద సేవకులు, సేవా కార్యక్రమాలు పలు సేవలు అందించిన వారందరికీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాడపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య సీనియర్ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మార్పు డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి పెద్దవడుగూరు మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, సిపిఐ నాయకులు శ్రీరాములు, ఓబి రెడ్డి, నీలూరు లక్ష్మయ్య సర్పంచు ఓంకార్ మ్మ శ్యామ్ సుందర్ నాయుడు, జూటూరు బషీర్, గుత్తి కార్యదర్శి రాందాస్ నారాయణ చిన్న కుల్లాయి రెడ్డి జూటూరు అర్షద్ కుల్లాయి రెడ్డి సాంబశివుడు, రసూల్ వీకే అభిమానులు సిపిఐ నాయకులు రైతులు పాల్గొన్నారు

# సామాజిక సేవలో ముందున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి సన్మానం



యాడికి మార్చి 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండలంలోని వేములపాడు గ్రామంలో కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి 3 వ వర్ధంతి సందర్భంగా సామాజిక సేవ చేస్తున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వికె వెంకటరామిరెడ్డి మూడవ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వక్తలు మాట్లాడుతూ వికె వెంకటరామిరెడ్డి చేసిన సేవలు, పోరాటాల గురించి గొప్పగా మాట్లాడడం జరిగింది. వీకే వెంకట్రాంరెడ్డి గ్రామస్తులకు అందించిన వైద్యం గురించి, పేదవారికి అందించిన సహాయాల గురించి వారి వారి మాటల్లో ప్రజలకు వివరించారు. రక్తదాన శిబిరం తో పాటు సామాజిక సేవ చేస్తున్న కొంతమందికి సన్మాన కార్యక్రమం వికె వెంకటరామిరెడ్డి కుమారుడు వికె ప్రదీప్ రెడ్డి చేతుల మీదుగా చేయడం జరిగింది. వేములపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గాయత్రికి వేములపాడు పంచాయతీ సెక్రెటరీ కి మరియు మరి కొంతమంది సామాజిక సేవ చేస్తున్న వారందరికీ ఈ కార్యక్రమంలో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి కె ప్రదీప్ కుమార్ రెడ్డి, సర్పంచ్ మైలా ఓంకారమ్మ, పుల్లారెడ్డి, రామకృష్ణ రెడ్డి,కుళ్ళాయి రెడ్డి, యల్లనూరు హాజీవలి,ఆలూరు రమేష్ కుమార్ రెడ్డి,మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ,చందగాని ధ్రువ నారాయణ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి,పర్లపాటి మహేంద్ర,టి లక్ష్మి కాంతమ్మ, సిద్ధవటం తిరుమలరెడ్డి, పల్లా శ్రీరంగ, పాల్గొనడం జరిగింది.

# గుడివాడ టిడిపి కార్యాలయంలో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే రావి శోభనాద్రి చౌదరి

**99వ జయంతి వేడుకలు**

**-రావి శోభనాద్రి చిత్రపటానికి నివాళులు అర్పించిన...**

**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, టిడిపి నాయకులు**



గుడివాడ మార్చి 24( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) గుడివాడ టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ రావి శోభనాద్రి చౌదరి 99వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మరియు టిడిపి నాయకులు రావి శోభనాద్రి చిత్రపటానికి పూల మాలల వేసి నివాళులు అర్పించారు. జోహార్ రావి శోభనాద్రి అంటూ పార్టీ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుండి గుడివాడలో పార్టీ ఉన్నతికి రావి శోభనాద్రి అందించిన సేవలు ఎనలేనివన్నారు. ఎందరికో రాజకీయ బిక్ష పెట్టిన ఆయన ఆదర్శప్రాయుడని కొనియాడారు. ముఖ్యంగా గుడివాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పట్టణ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్, స్వర్గీయ రావి శోభనాద్రి లాంటి మహనీయుల స్ఫూర్తితో గుడివాడ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ,లింగం ప్రసాద్ యార్లగడ్డ సుధారాణి, చేకూరు జగన్మోహన్రావు, పంద్రాజు సాంబయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, కరీముల్లా,షేక్ జానీ, సయ్యద్ జబీన్, షేక్ ఇబ్రహీం, మాదల సునీత, కంచనపల్లి సుబ్రమణ్యం,వసంతవాడ దుర్గారావు, కొల్లి రమ్య,అందుగుల ఏసుపాదం, వంగపండు ఆదినారాయణ, సిరిపురపు తులసీరాణి , సునీత, మెరుగు మాల బ్రహ్మయ్య,తెలుగు యువత, తెలుగు మహిళ, టిడిపి అనుబంధం విభాగాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కలిసిన ఫోర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు



న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: న్యూ ఢిల్లీలోని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని ఆమె నివాసంలో మంగళవారం ఫోర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, రిటైర్డ్ ఐ జి లు, ఏ డి జి లు,, సి ఐ ఎస్ ఎఫ్ డి ఐ జీ స్థాయి అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి వారి సమస్యలు, ఫోర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతిపాదనలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి తెలియజేయడం జరిగింది. ఈ అంశాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి, అవసరమైన విధాన మార్పుల కోసం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని వారికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# క్షయ వ్యాధిని అంతం చేయవచ్చు



పులిచెర్ల, మార్చి 24,(నేటి శుభోదయ) :ప్రజలు ప్రభుత్వంతో సహకరించి సమన్వయంతో సమిష్టిగా పోరాడితే క్షయ వ్యాధిని అంతం చేసి క్షయ రహిత భారత దేశాన్ని సాధించగలమని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ దినోత్సవమును పురస్కరించుకొని ఆయన ఆధ్వర్యాన ఆరోగ్య సిబ్బంది పులిచెర్ల గ్రామం లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తదనంతరం బస్టాండు కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ "టి.బి.ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా నేటి నుండి వంద రోజులు పాటు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా గ్రామాలలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, వ్యాధి రాగల వివిధ వర్గాల వారికి గళ్ళ మరియు ఎక్స్ రే పరీక్షలు నిర్వహించడం, క్షయ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు రావడం, జ్వరం ఉండటం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు గళ్ళలో రక్తం రావడం, ఛాతి నొప్పిగా ఉండడం, శ్వాస ఆడక పోవడం, రాత్రిపూట చమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, అలసటగా ఉండడం, ఊపిరితిత్తులు కాకుండా మిగిలిన అవయవాలలో గడ్డలు లేదా వాపు రావటం క్షయ వ్యాధి లక్షణాలని, ఈ లక్షణాలు ఉంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదిస్తే వారికి ఉచితంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సను అందజేస్తామని తెలియజేశారు. మధుమేహం, రక్తపోటు, ధూమపానము, మద్యం సేవించడం, శరీర ఎత్తుకు తగ్గ నిష్పత్తిలో బరువు లేనివారు, హెచ్.ఐ.వి. కలవారు హైరిస్కు గ్రూపుగా పరిగణించబడతారని, వారందరూ తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి ఉండి చికిత్స పొందని వ్యక్తుల ద్వారా సమాజంలోని వారికి గాలితుంపరల ద్వార వ్యాధి వ్యాప్తి చెందుతుందని కావున సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అపర్ణ, పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు ప్రమీల, పురుషోత్తం మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# టి బి ముక్త్ పంచాయితీగా దిగువపోకలవారిపల్లి



పులిచెర్ల, మార్చి 24,(నేటి శుభోదయ) :2025 సంవత్సరముకు గాను క్షయవ్యాధి రహిత పంచాయితీగా పులిచెర్ల మండలం దిగువ పోకల వారి పల్లి గ్రామపంచాయతీ ఎంపికైనదని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. ప్రపంచ క్షయ దినోత్సవమును పురస్కరించుకొని చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ జిల్లా కలెక్టర్ గారు అందజేసిన ప్రశంసా పత్రాన్ని మరియు జాతిపిత గాంధీజీ గారి ప్రతిమను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టి.బి. అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ చేతుల మీదుగా దిగువపోకలవారిపల్లి పంచాయితీ గ్రామ సర్పంచ్ ఉమాదేవి, కార్యదర్శి రమణయ్య, మహిళా ఆరోగ్య కార్యకర్త వేదవతి సంయుక్తంగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎలాంటి క్షయ వ్యాధి కేసులు నమోదు కాకుండ గ్రామపంచాయతీ ఆరోగ్య సిబ్బంది పావని, వేదవతి, ఆశా కార్యకర్తలు శ్యామల, వెంకటలక్ష్మి సమిష్టిగా పనిచేసినందుకు వారిని మరియు సహకరించినందకు గ్రామస్తులను, ఇతర శాఖల అధికారులను అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా పంచాయతీ పరిధిలో టి.బి. కేసులు నమోదు కాకుండా కృషి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఆరోగ్య సిబ్బందిని వైద్యురాలు డాక్టర్ అపర్ణ, పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు ప్రమీల మరియు పురుషోత్తం అభినందించారు.

# మోటూరు గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**హాస్టల్ వంటగది, మెనూ పరిశీలించి.... రికార్డులు తనిఖీ చేసిన ఎమ్మెల్యే**

**-వీడియో కాల్ ద్వారా అశుభ్రంగా ఉన్న వంటగది పరిసరాలను....కోఆర్డినేటర్ కు చూపించిన ఎమ్మెల్యేలి)**

**-విద్యార్థినీలతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ....**

**సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రాము**



గుడివాడ, మార్చ్ 24 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మండల పరిధిలోని మోటూరు గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల వంటగది, మెనూ చాట్ పరిశీలించి సరుకులు, కూరగాయల నిల్వలు తనిఖీ చేశారు. వంటగది పరిసరాలు అశుభ్ర వాతావరణంలో ఉండటాన్ని గుర్తించి సరి చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. వసతి గృహంలో వంట సిబ్బంది కొరత ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే రాము వీడియో కాల్ ద్వారా స్థానిక పరిస్థితులను గురుకుల పాఠశాలల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ కు చూపించారు. వంట సిబ్బందిని నియమించడంతో పాటుగా, పరిసరాలను మెరుగుపరచాలని సూచించారు. హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థినీలతో స్నేహపూర్వకంగా మాట్లాడగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యే రాముకు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ,భోజన నాణ్యత,రోజువారి మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు తెలిపిన సమస్యలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు వద్ద ఎమ్మెల్యే రాము ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. పాఠశాల, వసతి గృహం ప్రాంగణంలో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రాధాన్యత నివ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాము అన్నారు.ఎండిఓ విష్ణు ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాటరగడ్డ రవి పలువురు అధికారులు తనిఖీలో పాల్గొన్నారు.



# ఆర్డీటీ 'రెన్యూవల్' ఘనత మంత్రి లోకేశ్ దే

**-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**-ఆర్డీటీతో వేలాది మందికి మేలు**

**-సంస్థ విదేశీ నిధుల సమీకరణ నిలిపేసిన కేంద్రం**

**-లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగానే సమస్యకు పరిష్కారమైందంటూ హర్షం**

**- గత ప్రభుత్వ కుట్రపై ఆనాడే ఉద్యమించిన టీడీపీ : మంత్రి సవిత**




అమరావతి, మార్చి 24 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) అనంతపురంలోని రూరల్ డవలప్ మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. ఈ ఘనత ముమ్మాటికీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకశ్ దేనని కొనియాడారు. వారికి రాష్ట్రంలోని పేదల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ భూములు కొట్టేయాలని చూస్తే, ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న తాము ఆ సంస్థకు అండగా నిలిచామన్నారు. ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఎను కేంద్ర ప్రభుత్వం నిలిపేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కూటమి ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఎ ను పునద్ధరించిందన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. రాయలసీమ గడ్డపై సేవ అనే పదానికి ఆర్డీటీ మారు పేరుగా నిలిచిందన్నారు. 60 ఏళ్ల నుంచి ఆ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆపద్బాంధవిలా నిలుస్తూ, సామాజిక సేవలు అందిస్తోందన్నారు. స్పెయిన్ నుంచి వచ్చిన విన్సెంట్ ఫెర్రర్, ఆన్ ఫెర్రర్ దంపతులు అనంతపురంలోని వెనుకబడిన ప్రాంతాలను చూసి చలించిపోయారన్నారు. ఆర్డీటీ సంస్థను స్థాపించి పేదలకు విద్య, వైద్య సేవలు అందించారన్నారు. ఇళ్లు లేని వేలాది మందికి గృహ సదుపాయం కల్పించారని, మరికొందరు పేదలకు వ్యవసాయం కోసం భూములిచ్చారని, ఆధునిక పనిముట్లు అందిస్తూ రైతులకు తోడుగా నిలిచారని కొనియాడారు. ముఖ్యంగా, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందజేశారని, ఎందరో అనంతపురం క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన సందర్భాలున్నాయన్నారు. ఆర్డీటీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుతో ఎందరో పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అత్యవసర చికిత్స కోసం బెంగళూరుకో, హైదరాబాద్‌కో వెళ్లాల్సిన అవసరం తప్పిందన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఈ ఆసుపత్రి ఓ వరమన్నారు. వేలాది మంది పేద బిడ్డలను చదివించి ఆ సంస్థ ప్రయోజకులను చేసిందని మంత్రి కొనియారు.

## ఈ ఘనత ముమ్మాటికీ లోకేశ్ దే...

గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ వంటి సేవా సంస్థను కూడా రాజకీయ కక్షతో వేధించిందని మంత్రి సవిత మండిపడ్డారు. దీనివల్ల ఎందరో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇదే సమయంలో ఆర్డీటీ నిధుల సమీకరణలో కీలకమైన విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను కేంద్ర ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఇదే విషయమై తనతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. ప్రధాని నరేంద్రమోడి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను ఒప్పించి, ఆర్డీటీ సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ) పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ ఘనత ముమ్మాటికీ మంత్రి నారా లోకేశ్ దేనని మంత్రి సవిత కొనియాడారు.

## వైసీపీ కుట్రలను అడ్డుకున్నాం

వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీ సంస్థ భూములను సైతం కొట్టేయడానికి ఆనాటి వైసీపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని మంత్రి సవిత మండిపడ్డారు. అనంతపురం నగరం శివార్లలోని రుద్రంపేట సర్వే నెం.106లో ఉన్న 4.20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని గత ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న తమ పార్టీ తీవ్రస్థాయిలో ఉద్యమించిందన్నారు. అదే సమయంలో ఆ భూములపై ఆర్డీటీ కూడా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుందన్నారు. మంత్రి నారా లోకేశ్ తన యువగళం పాదయాత్రలో ఆనాటి వైసీపీ ప్రభుత్వ అన్యాయాన్ని స్వయంగా చూశారన్నారు. ఆనాడే ఆయన మాటిచ్చారని, కూటమి ప్రభుత్వం రాగానే ఆర్డీటీ ఆస్తులను కాపాడతామని, సంస్థ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఆర్డీటీ సంస్థ విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను పునరుద్ధరణకు కృషి చేశారని అన్నారు. ఉమ్మడి అనంతపురంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల తరఫున సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

# సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి

**- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**

**- జిల్లా లో ప్రధానమైన ముగ్గురు మంత్రులు ఉండి మూడు వందల కోట్ల రూపాయలు కేటాయింపు**

**- సవతి తల్లి ప్రేమ**

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు**




ఖమ్మం, నేటి శుభోదయ ::: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాల భూమి కి సాగు నీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు.మంగళవారం ఖమ్మం మంచి కంటి హాల్ లో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు కేటాయించాలి అని, వ్యవసాయ రంగం కు నిధులు కోత సవరించాలి, విద్యా, వైద్య రంగాలకు మరియు సంక్షేమ పథకాలకు నిధులు కేటాయింపులు పెంచాలి అని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశం కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం కు శాసనసభ లో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో అంకెలు సంఖ్యలు పెరుగుదల తప్ప వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏడు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న సీతారామ ప్రాజెక్టు కు నిధులు కేటాయింపులు తక్కువ చేయుడం పై ముగ్గురు మంత్రులు భాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.గోదావరి నది పై సీతమ్మ బ్యారేజి నిర్మాణం పూర్తి చేయకుండా సాగు నీరు 2026 ఆగస్టు 15 నాటికి అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైరా రైతు సభలో ప్రకటించారు అని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిన పనులు ఆధారంగా నీరు కొని ప్రాంతాలకు అందించే ప్రయత్నం తప్ప , పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేసే పనులు పూర్తి చేయడం లేదని అన్నారు, సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వం కు రెండు కండ్లు అని చెప్పిన ఆచరణ లో విద్యా, వైద్య రంగాలకు నిధులు కేటాయింపులు తక్కువ చేశారు అని అన్నారు, ఆక్స్ఫర్డ్, క్రేంబిడ్జి స్థాయిలో తెలంగాణ విద్యార్థులకు విద్యా అందించాలంటే ప్రభుత్వ విద్యా సంస్థలు అన్నింటిలో అత్యంత నాణ్యమైన వసతులు, సౌకర్యాలు కల్పించడం తోపాటు విద్యా లో ఉన్న అంతరాలను రూపు మా పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన 9000 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా మూడు వందల ముప్పై ఆరు కోట్ల రూపాయలు కేటాయించడం సవతి తల్లి ప్రేమ కు నిదర్శనం అన్నారు. ఇందిరమ్మ భీమా పథకం కుటుంబ సభ్యులు అందరికీ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు, ఇండ్ల స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అందుకు అవసరమైన నిధులు బడ్జెట్ లో కేటాయించాలని కోరారు. లోపభూయిష్టంగా ఉన్న విద్యా విధానం మూలంగా విద్యార్థులు ఆ త్మ హ త్య లు చేసుకుంటున్నారని విద్యా విధానాన్ని అన్ని స్థాయిల్లో సంస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, ఎస్ కె మీరా వాసిరెడ్డి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రా శ్రీనివాసరావు, వత్సవాయి జానికిరాములు ,కొండె బోయిన నాగేశ్వరరావు, తాళ్ళపల్లి కృష్ణ,నంద్ర ప్రసాద్, తన్నీరు కృష్ణార్జున రావు, పాపినేని రాంనర్సయ్య,కెవి రెడ్డి, కె విపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ కె బషీర్, కె నరెంద్ర, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నాయకులు కళ్యాణం నాగేశ్వరరావు,రైతు సంఘం జిల్లా నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వరరావు,కుసుపూడి మధు, వడ్లమూడి నాగేశ్వరరావు,వెంకన్న, షరీఫ్, జ్యోతి బసు తదితరులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజన నాణ్యతపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకస్మిక తనిఖీ



**-స్వయంగా రుచి చూసి అధికారులకు కీలక ఆదేశాలు**

విజయవాడ, మార్చి 24 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం రుచిగా శుచిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు అవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా భోజనశాలకు వెళ్లి, విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహారం నాణ్యతను పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కాసేపు ముచ్చటించి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కేవలం కడుపు నింపడమే కాకుండా, అది రుచిగా, అత్యంత శుచిగా ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. భోజనం సిద్ధమైన తర్వాత విద్యార్థులకు వడ్డించే ముందు, ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఆ ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను ధృవీకరించాలని ఆయన ఆదేశించారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# ఇండిగో విమానంలో సాంకేతిక లోపం




గన్నవరం, మార్చి 24 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) హైదరాబాదు నుంచి గన్నవరం వచ్చిన ఇండిగో విమానం లో సాంకేతిక లోపం వచ్చింది.ల్యాండింగ్ అవుతున్న సమయంలో రన్వేపై సడన్గా ఇండిగో విమానం నిలిచిపోయినట్టు అధికారులు పేర్కొన్నారు.విమానంలో ఆర్థిక శాఖ మంత్రి పర్యావుల కేశవ్ ఉన్నట్లు సమాచారం.తిరిగి గన్నవరం నుండి హైదరాబాదు వెళ్ళవలసిన ఇండిగో సర్వీస్ ను అధికారులు నిలిపి వేశారు.

# విద్యుత్ శాఖ ఏ డి కి

## వినతి పత్రం అందజేసిన చిప్పాడ నరసింహారావు



జంగారెడ్డిగూడెం మార్చి 24 (నేటి శుభోదయ ప్రతినిధి కోసనం ప్రేమ్ కిరణ్):చింతలపూడి నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు మరియుకామవరపు కోట పట్టణం మండల నాయి బ్రాహ్మణ సోదరులుకామవరపుకోట పట్టణ మండల పరిధిలో ఉన్న నాయి బ్రాహ్మణ బార్బర్ షాపులకు గత ప్రభుత్వం నూటయాభైయూనిట్ల ఉచిత విద్యుత్తు మంజూరు చేయడం జరిగింది 2024 ఎన్నికల్లో హామీలు భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నూటయాభై యూనిట్లకు అదనంగా యాభై యూనిట్లు కలిపి మొత్తం రెదు వందలు యూనిట్లు బార్బర్ షాపులకు అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగింది అధికారంలోకి వచ్చిన తర్వాత యాభై యూనిట్లు కలిపి రెండు వందల యూనిట్లు ఇవ్వమని అధికారులకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది కానీ కామవరపుకోట మండలం పట్టణ పరిధిలో బార్బర్ షాప్ లకు అదనంగా ఇస్తా అన్న యాభై యూనిట్లు అమలు కాలేదని ఈరోజు కామవరపుకోట విద్యుత్ శాఖ అధికారి ఎడి ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఏడి సానుకూలంగా స్పందించి తక్షణమే నూటయాభై యూనిట్లు అమలవుతున్న బార్బర్ షాపులను పరిశీలించి అదనంగా ఇస్తానన్న యాభై యూనిట్లు కలిపి రెండు వందల యూనిట్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు నాయి బ్రాహ్మణ సోదరులందరూ ఏడి కి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు కామవరపుకోట పట్టణ అధ్యక్షులు చెడే నాగరాజు సెక్రెటరీ గన్నవరపు వెంకటాచలం చెడే బద్రి యూత్ అధ్యక్షులు శీలారపు ప్రశాంత్ రాజ్ సిహెచ్ వీరభద్రరావు జి కుమార్ చెడే ప్రసన్నకుమార్ పాల్గొన్నారు

# దొంగ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్



పులిచెర్ల, మార్చి 24,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఐపీస్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా నందు పులిచెర్ల మండలం లో ఎం.పీ.డీ.వో మరియు 106 రామి రెడ్డి గారి పల్లె విలేజ్ సెక్రెటరీ కి సంబంధించి నకిలీ సీలు తయారుచేసి వివిధ రకాల కేసుల యందు నకిలీ సర్టిఫికెట్ ద్వారా షూరిటీలను ప్రొడ్యూస్ చేస్తున్నారని రాజ శేఖర్ బాబు, ఎంపీడీవో పులిచెర్ల మండలం ఇచ్చిన పిర్యాదు పైన 18/3/2026వ తేదీ కేసు రిజిస్టర్ చేసి డిఎస్పీ శ్రీ సాయినాథ్ ఆదేశాల మేరకు కల్లూరు సిఐ ఎం జయ రామయ్య మరియు కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేపట్టి దర్యాప్తులో భాగంగా ఐదు మంది ముద్దాయిలను అరెస్టు చేసి వారి నుండి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయుటకు ఉపయోగించిన ఎంపీడీవో పులిచెర్ల ఎంపీడీవో చిన్నగొట్టిగల్లు విలేజ్ పంచాయతీ సెక్రెటరీ 106 రామిరెడ్డి గారి పల్లె మరియు పంచాయతీ సెక్రెటరీ చినగొట్టిగల్లు కు సంబంధించి సీళ్ళను ఇంకిపాదులను, పెన్నులను స్వాధీనం చేసుకొని వాటితో కూడా ఇంకా కొన్ని వారి దగ్గర ఉన్నటువంటి నకిలీ వాల్యుయేషన్ సర్టిఫికెట్స్ ను స్వాధీనం చేసుకొని నిన్నటి దినము డి. ఆంజనేయులు, రవి ఎం. చెంగల రాయులు ముగ్గురు తయారు చేసేవాళ్లు తర్వాత బ్రహ్మయ్య ఇతను తిరుపతికి చెందిన వాడు ఇతను సీళ్ళను బాలసుబ్రమణ్యం అనేసి ఇతను సీళ్ళను తయారు చేసినాడు. వీళ్లు తయారు చేసినటువంటి నకిలీ సర్టిఫికేట్ ఇచ్చి తిరుపతి కోర్టు యందు, పాకాల, పీలేరు, పుంగనూరు మరియు చిత్తూరు కోర్టు యందు వివిధ కేసులకు సంబంధించి సుమారు ఒక 200 మంది ముద్దాయి లకి లాయర్ల ద్వారా నకిలీ షూరిటీలు ఇవ్వడమైనది. కాబట్టి వీళ్ళందరినీ ఈ కేసులో ముద్దాయిలుగా పరిగణించి నిన్నటి దినము అరెస్టు చేసి ఈ దినము రిమాండ్కు పంపడమైనది.ఇందులో ఇన్వెస్టిగేషన్ లో భాగంగా కల్లూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది అయినటువంటి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఆనందు, నాగరాజు, కానిస్టేబుల్ బావాజీ, మహేష్, వాసు, శ్రీనివాసులు వీళ్ళందరూ సహకరించినందుకు డిఎస్పీ వీళ్లకు ప్రత్యేకమైనటువంటి అభినందనలు తెలియజేయడమైనది.ఎ 1 - డి ఆంజనేయులు 106 రామిరెడ్డి గారి పల్లి హరిజనవాడ పులిచెర్ల మండలం ఏ 2 - సి రవి 106 రామిరెడ్డి గారి పల్లి హరిజనవాడ పులిచెర్ల మండలం ఏ 3 - నీల వెంకటరమణ జంగావాండ్లపల్లి చిన్నగొట్టిగల్లు మండలం ఎ 4 - పి బ్రహ్మయ్య గాంధీపురం తిరుపతి ఎ 5 - బాలసుబ్రమణ్యం యాదవ కాలనీ తిరుపతి

# విజయవాడలో ఉగ్రలింకులు అదుపులో ముగ్గురు యువకులు

## భయభ్రాంతులకు గురవుతున్న బెజవాడ వాసులు




విజయవాడ, మార్చి 24 (నేటి శుభోదయ):- విజయవాడలో ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అధికారులు రహస్యంగా విచారిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేయడంతో రాష్ట్ర సీఐ సెల్ అధికారులు నిరంతర నిఘా చేపట్టారు. ఈ నిఘాలో భాగంగా సోషల్ మీడియా కార్యకలాపాలపై దృష్టి సారించిన అధికారులకు, ఈ ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు తెలిసింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, వారి నివాసాల్లో సోదాలు నిర్వహించి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ యువకులు విదేశాల్లోని ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన పోస్టులు పెట్టినట్లు అంగీకరించినట్లు తెలిసింది. ప్రస్తుతం వీరిని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఎవరు ప్రోత్సహిస్తున్నారు? సోషల్ మీడియా ఖాతాల్లోని లింకులు ఎక్కడివి? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన విజయవాడలో కలకలం రేపింది. గత ఏడాది నవంబరు నెలలో కానూరు న్యూ ఆటోనగర్ లో 27 మంది మావోయిస్టు లను పోలీసులు అరెస్టు చేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ వరుస ఘటనలతో బెజవాడ వాసులలో భయాందోళనలు నెలకొన్నాయి.

## బుడగ జంగాల కాలనీ బాధితులకు

# మెరుగైన వైద్యం అందించండి

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశం



నేటి శుభోదయ నంద్యాల మార్చి 24 :నంద్యాల జిల్లా ప్రతినిధి :నంద్యాల పట్టణంలోని వైయస్సార్ నగర్ బుడగ జంగాల కాలనీలో నిన్న రాత్రి చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన చాలా బాధాకరమని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . ప్రస్తుతం నెల్లూరు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి ఫరూక్ ఘటన గురించి తెలిసిన వెంటనే అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఫరూక్ అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గారితో ఫోన్ లో మాట్లాడిన మంత్రి ఫరూక్ ఘటన తీవ్రతను అడిగి తెలుసుకొని, బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు విధుల్లో ఉన్న వైద్యులతో మాట్లాడి, చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ గారు మాట్లాడుతూ బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. “ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం,” అని తెలిపారు . తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు వెంటనే స్పందించి, బాధితులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని మరియు వారికి ధైర్యం చెప్పాలని మంత్రి ఫరూక్ సూచించారు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ట్రాన్స్జండర్ సమాజానికి న్యాయం చేయాలని పార్లమెంట్ లో గళమెత్తిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

-న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: దేశంలో ట్రాన్సజెండర్ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ మంగళవారం లోక్ సభలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గళమెత్తారు. లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రసంగిస్తూ ముఖ్యమైన విషయం గురించి మాట్లాడటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు మేడం. గత కొన్ని నెలలుగా కొన్ని ఆందోళనలు ఉన్నాయి. ట్రాన్స్జెండర్ సమాజం యొక్క ఆందోళనలను చూసిన తర్వాత, నేను ఈ బిల్లును వివరంగా చదివాను. ఈ బిల్లు గురించి ట్రాన్స్జెండర్ సమాజం కొంచెం తప్పుగా అర్థం చేసుకుందని చాలా స్పష్టంగా ఉంది. ఈ బిల్లు నేను చెప్పగలను, ఇది గుర్తింపు, న్యాయాన్ని కూడా ట్రాన్స్జెండర్ సమాజానికి అందిస్తుంది, ఇది ఒక చారిత్రాత్మక బిల్లు. రామాయణం, అప్పుడు రాముడు, 14 సంవత్సరాల వనవాసానికి వెళ్ళినప్పుడు, అతనితో వచ్చిన వారు. మీరంతా దయచేసి అయోధ్యకు తిరిగి వెళ్ళండి, నేను నా 14 సంవత్సరాల వనవాసాన్ని పూర్తి చేస్తాను అని ఆయన అంటాడు. ఆ తర్వాత 14 సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చినప్పుడు, ఇద్దరు వ్యక్తులు అక్కడ రాముడి కోసం ఎదురు చూస్తున్నారు. అడిగినప్పుడు. మమ్మల్ని నిషేధించారు. మన డ్రామా, మీరు గతంలో ఉన్నారు, పురుషులు, మహిళలు మాత్రమే వెళ్ళాలి. మేము కూడా చెందము, మేము పురుషులు లేదా స్త్రీలకు చెందము. అందువల్ల, శ్రీరాముడు ఆ సమాధానంతో చాలా కదిలించబడ్డాడు, అప్పటి నుండి, అతను ఆశీర్వదించాడు. ఆయన వారిని ఆశీర్వదించి ఇలా అన్నాడు, మీ కాగితాలు మైక్ ను తాకుతున్నాయని నేను చూడగలను, ఇది అంతరాయాన్ని కలిగిస్తుంది. అవును. ధన్యవాదాలు. క్షమించండి. కాబట్టి అతను అందరినీ ఆశీర్వదించడానికి ట్రాన్స్జెండర్లకు అధికారం ఇచ్చాడు. మరి అప్పటి నుండి వారు మన సంస్కృతిలో అంతర్భాగంగా మారారు. మరి ముఖ్యంగా నా జిల్లాకు చెందిన ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ నా హృదయానికి చాలా దగ్గరగా ఉంది. నేను మీకు చెప్పగలను. కాబట్టి దయచేసి. నేను కాదు. నేను వారు ఇలా అని నమ్ముతున్నాను, వారు రెహానా అని మేము నమ్ముతున్నాము. మోడీజీ అయోధ్యకు అయోధ్యకు రామమందిరం తీసుకున్నప్పుడు, అతను ఖచ్చితంగా ప్రభువు శ్రీరాముని ఆశీర్వదించబడిన మనలను ఆశీర్వదించే ప్రజలకు న్యాయం చేస్తారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. బిల్లుకు తిరిగి వస్తే, కొన్ని ఆందోళనలు ఉన్నాయి, దీని గురించిన ప్రధాన ఆందోళన ఏమిటంటే, ట్రాన్స్జెండర్ల నిర్వచనంలో ట్రాన్స్ పురుషులు, ట్రాన్స్ మహిళలను చేర్చకపోవడం. సామాజిక-సాంస్కృతిక గుర్తింపు కలిగిన




వ్యక్తులను ట్రాన్స్జెండర్గా గుర్తించడంతో పాటు, ఈ బిల్లుతో ప్రజలను కూడా కలుపుతారు. జెనెసిస్, ప్రాథమిక లైంగిక లక్షణాలు, బాహ్య జననేంద్రియాలు, ఎండోజెనస్ హార్మోన్ ఉత్పత్తి, అన్నిటిని కలిగి ఉంటాయి. ఇది సరైన వ్యవస్థగా ఉండాలి. మనం పుట్టినప్పుడు, వైద్యులు మన లింగాన్ని నిర్ణయిస్తారు. ఇక్కడ కూర్చున్న ప్రతి ఒక్కరికి మన లింగాన్ని నిర్ణయించడానికి జనన ధృవీకరణ పత్రం ఉంది. ఈ జనన ధృవీకరణ పత్రం మనం చనిపోయే వరకు ఉపయోగించబడుతుంది. ఒక ట్రాన్స్జెండర్ గుర్తింపును ఎందుకు కలిగి ఉండకూడదు? నేను మా సహోద్యోగులలో ఒకరి నుండి విన్నాను, వారు మహిళా రిజర్వేషన్ బిల్లు వస్తుందని చెబుతున్నారు, మనకు మన లింగాన్ని గుర్తించడానికి వ్యవస్థ లేకపోతే, మేము గుర్తిస్తాము. వస్తుంది. మనకు లింగాలను గుర్తించే వ్యవస్థ లేకపోతే, మేము మహిళలుగా గుర్తించబడతాము, తరువాత మహిళా రిజర్వేషన్ నుండి మనం పొందుతాము. అదే వారు చెబుతున్నారు. ఎందుకంటే నకిలీ కేసులు చాలా పెరుగుతున్నాయి. ట్రాన్స్జెండర్లుగా నటిస్తున్న నకిలీ కేసులు పెరుగుతున్నాయి. ఒక ట్రాన్స్జెండర్ సంఘం నన్ను సంప్రదించింది. ఈ రోజు ప్రతిపక్షం ట్రాన్స్జెండర్ సమాజం గురించి, వారి హక్కుల గురించి మాట్లాడుతోంది. కానీ వారు అధికారంలో ఉన్నప్పుడు, వారు ట్రాన్స్జెండర్ సమాజానికి న్యాయం చేశారా, వారు వారిని వీధుల్లో వదిలేశారు, వారు రోడ్డుపై కుళ్ళిపోవడానికి వదిలేశారు. నేను మీకు చెప్పగలను, ఏమిటంటే వారు ఆశీర్వాదం కోసం నా నంద్యాల్ జిల్లాలో స్టేషన్. కాబట్టి ఇది ట్రాన్స్జెండర్ జనాభాలో చాలా ఇబ్బందులను సృష్టించింది, ఎందుకంటే వారు మమ్మల్ని ఆధిపత్యం చెలాయిస్తున్నారు. కాబట్టి అలాంటి నకిలీ కేసులు తగ్గాలి. ఈ బిల్లు సర్టిఫికెట్, పుట్టిన తేదీ ఇవ్వడానికి కూడా చేర్చబడింది, పుట్టిన తేదీలో వారు పేరు మార్చుకోవచ్చు, పుట్టిన తేదీలో సెక్స్ కూడా మార్చుకోవచ్చు, ఇది వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పురుషుడు, స్త్రీ లేదా మూడవ లింగం వంటి లింగ గుర్తింపును ప్రతి విధంగానూ చట్టబద్ధంగా గుర్తించడం జరుగుతుంది, ఈ వ్యక్తులను వీటి ద్వారా గుర్తించవచ్చు. ఈ ప్రజలు చిన్నప్పటి నుంచి ఉన్నారు. పాఠశాల, కళాశాలలో వారి ఉద్యోగాల సమయంలో ప్రతిచోటా వారు వివక్షకు గురయ్యారు, చాలా సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ సెక్షన్ 18 మరింత సవరించబడింది. ట్రాన్స్జెండర్ సమాజాన్ని దోచుకునే వ్యక్తుల కోసం ఇది కఠినమైన, కఠినమైన జరిమానాలు అందిస్తుంది కాబట్టి ఈ విభాగం చాలా ముఖ్యమైనది, ఎందుకంటే ఇది ట్రాన్స్జెండర్ సమాజాన్ని దోచుకునే వ్యక్తులపై కఠినమైన, కఠోరమైన శిక్షలను అందిస్తుంది. వారికి చాలా కఠినంగా శిక్ష విధించబడింది. ఏదైనా వ్యక్తిని కిడ్నాప్ చేయడం, నపుంసకత్వం, విచ్ఛేదనం లేదా ఏదైనా శస్త్రచికిత్స, రసాయన లేదా హార్మోనల్ విధానాన్ని లేదా వారి శరీరానికి లేదా శరీరానికి శాశ్వతమైన లేదా తీవ్రమైన గాయం కలిగించడం, పిల్లలను ట్రాన్స్జెండర్గా మార్చడానికి బలవంతం చేయడం కూడా ఇందులో ఉన్నాయి. కాబట్టి 10 నుండి 14 సంవత్సరాల వరకు కఠినమైన శిక్ష, మూడు సంవత్సరాల జరిమానా విధించినందుకు మనం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ ప్రాథమిక మానవ హక్కుల కోసం కోర్టులకు వెళ్లవలసి వచ్చిన అనేక సంఘటనలు ఉన్నాయి, ఈ బిల్లు మెజారిటీ సమస్యలను పరిష్కరిస్తుంది. స్మైల్ స్కీమ్, ఆయుష్మాన్ భారత్‌లో ఆరోగ్య బీమా వంటి వివిధ పథకాలతో పాటు వారికి షెల్టర్లు, పునరావాసం కల్పిస్తున్నారు, ప్రతి విధంగా మేము సహాయం చేస్తున్నాము ఆంధ్రప్రదేశ్ రెండవ అతిపెద్దది, ఇది రెండవ అతిపెద్ద ట్రాన్స్జెండర్ కమ్యూనిటీని కలిగి ఉంది. భారతదేశం రెండవ అతిపెద్ద ట్రాన్స్జెండర్ సమాజం, మేము వారికి వీలైనంత వరకు సహాయం చేస్తున్నాము, ఈ రోజు కూడా మన సామాజిక సంక్షేమ మంత్రి ట్రాన్స్జెండర్ కమ్యూనిటీకి ఆటోలను పంపిణీ చేశారు. మేము మా రాష్ట్రంలోని ప్రతి ట్రాన్స్జెండర్ వ్యక్తికి ఎన్టీఆర్ భరోసా 4000 పెన్షన్ ఇస్తున్నాము, నేను మంత్రి అభ్యర్థించాలనుకుంటున్నాను, మేము ప్రతి రోజు ట్రాన్స్జెండర్ సమాజం నుండి చాలా ఆందోళనలను పొందుతున్నాము. కాబట్టి ట్రాన్స్జెండర్ సమాజం లేవనెత్తిన ప్రతి ఆందోళనను మంత్రి పరిశీలించాలని నేను కోరుకుంటున్నాను, ఎందుకంటే మనం వారి పక్షాన ఉండాలి, మేము చేస్తామని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. మనం వారి పక్షాన ఉండాలి, మనం న్యాయం చేస్తామని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను, ఈ బిల్లు ట్రాన్స్జెండర్ సమాజానికి నిజమైన న్యాయం చేస్తుంది. ఈ మాటలతో నేను బిల్లుకు మద్దతు ఇస్తున్నాను అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో సుదీర్ఘ ప్రసంగం చేశారు.

# ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమావేశం

## నీటి పారుదలపై చర్చించిన మంత్రులు అధికారులు



అనంతపురం మార్చి 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: విజయవాడ లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేగళ్ళ లీలాకృష్ణ ఆధ్వర్యంలో ఏపీ ఎస్ ఐ డి సి బోర్డ్ సమావేశం నిర్వహించగా ఈ సమావేశం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీ ఎస్ ఐ డి సి డైరెక్టర్ బాలలోకేష్ యాదవ్ పాల్గొని నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చర్చించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు డా “నిమ్మల రామానాయుడు క్యాంప్ కార్యాలయంలో మంత్రివర్యులు తో ఇరిగేషన్ సంబంధిత పలు విషయాలు చర్చించిన బోర్డు చైర్మన్, డైరెక్టర్ లు అధికారులు. వేసవికాలంలో ఎద్దడిని తట్టుకొని సకాలంలో పంటలకు కావలసినటువంటి నీరు అదేవిధంగా గోదావరి జిల్లాలో చేపల చెరువులకు కావలసిన నీరు తదితర కీలకమైనటువంటి విషయాలు చర్చించడం జరిగింది. రాష్ట్రంలో పలు జిల్లాలలో కాలువలలో పూడికను తీసివేత కార్యక్రమం అదేవిధంగా తెగినటువంటి కాలువ మరమ్మతులు అందుకు సంబంధించినటువంటి ఆర్థిక వనరులు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి పనులకు కావలసిన ఆదేశాలను త్వరితగతిన పూర్తిచేయాలని కమిషనర్ కి మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ బోర్డు డైరెక్టర్లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు..



# బదిలీపై వెళ్లిన వైద్యాధికారికి ఘన సన్మానం




తాడిపత్రి మార్చి 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: రూరల్ పరిధిలోని చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ద్వితీయ వైద్యాధికారి డాక్టర్ కేశవానంద ఉన్నత విద్య(పీజీ -ఆర్థో )అర్హత సాధించి బదిలీపై వెళుతున్న సందర్భంగా వైద్యాధికారులు మరియు వైద్య సిబ్బంది డాక్టర్ కేశవానంద ని ఘనంగా సన్మానించారు. ప్రథమ వైద్యాధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ డాక్టర్ కేశవానంద తన విధి నిర్వహణలో ఎంతోమంది పేద ప్రజలకు వైద్య సేవలు అందించి మన్ననలు పొందారని, తన యొక్క వైద్య సేవలను కొనియాడారు.బదిలీపై వెళ్లిన వైద్యాధికారి డాక్టర్ కేశవానంద మాట్లాడుతూ చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించినన్ని రోజులు సిబ్బంది తనకు ఎంతో సహకరించారని, వైద్య సిబ్బంది అందరి సహకారంతోనే తాను పీజీ విద్యార్హత సీటు సాధించానని తెలిపారు, అనంతరం వైద్యాధికారి డాక్టర్ కేశవానందని పూలమాల మరియు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కో-లోకేటెడ్ మరియు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రపు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు....



## ఉజ్వల గ్యాస్ పథకానికి శ్రీకారం

# చింతూరులో ఘనంగా ప్రారంభం

**- మహిళలకు పెద్ద ఊరట : టీడీపీ నేతలు**

**- ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం అని వ్యాఖ్యలు**



చింతూరు డివిజన్ నేటి శుభోదయ :ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉజ్వల ఉచిత గ్యాస్ పథకాన్ని మంగళవారం చింతూరు మండలంలో ఘనంగా ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ చేతుల మీదగా, టీడీపీ యూత్ ప్రెసిడెంట్ ఎండీ రియాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ, గృహిణులు వంటలో ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. ఉజ్వల గ్యాస్ పథకం ద్వారా మహిళలకు సౌకర్యం కలగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో చమురు, గ్యాస్ కొరతలు ఉన్నప్పటికీ మహిళలకు ఉచిత గ్యాస్ అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమన్నారు. భారత్ గ్యాస్ ద్వారా అందిస్తున్న ఈ పథకాన్ని ప్రతి అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పి. సాల్మన్ రాజు, పంచాయతీ కార్యదర్శి గుంపెనపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్

## ధ్రువీకరణ పత్రాల ప్రదానోత్సవం




చింతూరు డివిజన్ నేటి శుభోదయ:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ పి. యం.ఉషా పథకం ఆర్థిక సహకారంతో మంగళవారం సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిత్యం నేటి సమాజంలో ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయనీ, ఏదైనా విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు మనల్ని మనం రక్షించుకోవడానికి స్వీయ రక్షణ అవసరమన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నుండి ఎన్.లక్ష్మి మాట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవడం వలన ఆపద ఏర్పడినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని నిలబడే శారీరక,మానసిక, దృఢ సంకల్పం వస్తుందని, ఈ రోజుల్లో ఆడవారు అన్నిరంగాల్లో ముందుండి సమాజాన్ని నడిపిస్తున్నారని, వయస్సుతో సంబంధం లేకుండా సెల్ఫ్ డిఫెన్స్ అవసరమని,రాణి రుద్రమదేవిలా బాలికలు శక్తివంతంగా తయారవ్వాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ ఎమ్.శేఖర్ మాట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ మంచి కార్యక్రమం ప్రస్తుత రోజుల్లో అఘాయిత్యాలు బాగా జరుగుతున్నాయని ముఖ్యంగా బాలికలు తమను తాము రక్షించుకోవడంపై స్వీయ రక్షణ శిక్షణ అవసరమన్నారు. కళాశాల పి.యం.ఉషా కోఆర్డినేటర్ జి. వెంకట్రావు మాట్లాడుతూ ఆడపిల్లల్లో ధైర్యం ఉండాలని,ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.అనంతరం ముఖ్య అతిథిని అధ్యాపకులు మరియు విద్యార్థులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కోఆర్డినేటర్ కె. శైలజ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి,డా.వై.పద్మ,డా.కె. శకుంతల,ఎమ్. నాగమోహన్ రావు,జి. సాయికుమార్,ఆర్. ఈమౌనిక,బి. శ్రీనివాసరావు,ఎన్. ఆనంద్, కె.లక్ష్మీ ప్రసన్న, ఆర్. కిరణ్మయి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# సామాజిక ఆరోగ్య కేంద్రంలో అరుదైన శిశువు జననం

## తల్లి ప్రాణాలు కాపాడిన వైద్య బృందం



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం లో ఒక అరుదైన మరియు క్లిష్టమైన శిశువు జననం మంగళవారం చోటుచేసుకుంది.చింతూరు మండలంలోని ఎర్రంపేట గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ, సుమారు 6 నెలల గర్భంతో మూడు రోజుల క్రితం చెకప్ కోసం ఆసుపత్రి కు రాగా ఆసుపత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ రమణరావు ఆమెను పరిశీలించి, గర్భంలోని శిశువుకు తీవ్రమైన అభివృద్ధి లోపాలు ఉన్నట్లు గుర్తించారు.వైద్యుల ప్రకారం, శిశువులో మెదడు మరియు దాని చుట్టూ ఏర్పడవలసిన పుర్రె ఎముకలు సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో శిశువు పుట్టిన వెంటనే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.ఈ కేసు పిండంలో ఉన్న తీవ్రమైన పుట్టుకలోపాల కారణంగా అత్యంత క్లిష్టంగా మారింది అని తెలిపారు ఈ కారణంగా ముఖ్య లోపాలు గా పుర్రె ఎముకలు సరిగా అభివృద్ధి చెందకపోవడం,మెదడు కణజాలం బయటకు కనిపించడం,మెనింగోమైలోసెల్ అనుమానం అలాగే తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటం మరియు ప్రాణాపాయం ఉన్న నేపథ్యంలో వైద్య బృందం తక్షణమే స్పందించి అత్యవసరంగా లోయర్ సెగ్మెంట్ సిజేరియన్ సెక్షన్ శస్త్రచికిత్స నిర్వహించి తల్లి ప్రాణాలను విజయవంతంగా కాపాడారు. ఈ అరుదైన కేసును సమర్థవంతంగా నిర్వహించిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు సహాయక సిబ్బంది సేవలను ఆసుపత్రి యాజమాన్యం సూపరిండెండెంట్ కోటిరెడ్డి అభినందించారు.

# కోరుకొండ రైతులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బహుమతి

## 256 ఎకరాల భూమికి 22-ఏ నుండి విముక్తి..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె. );తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని వందలాది రైతు కుటుంబాలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తీపి కబురు అందించారు. గత పదేళ్లుగా నిషేధిత భూముల జాబితా (రావణ్అశీఅ 22-ఏ) లో చిక్కుకుపోయి, క్రయవిక్రయాలకు వీలులేకుండా ఉన్న 256 ఎకరాల భూమిని ఆ జాబితా నుండి తొలగించినట్లు ఆయన ప్రకటించారు.ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారంగత ప్రభుత్వాల హయాంలో రికార్డుల లోపాల వల్ల అనేక ప్రైవేటు భూములు పొరపాటున 22-ఏ జాబితాలో చేరిపోయాయి. దీనివల్ల రైతులకు తమ సొంత భూమిపై హక్కులు ఉన్నప్పటికీ, వాటిని అమ్ముకోవడానికి లేదా బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందడానికి వీలులేకుండా పోయింది. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు.వార్త ముఖ్యాంశాలు:తొలగింపు: 256 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుండి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఉపశమనం: ఈ నిర్ణయంతో రాజానగరం పరిధిలోని బాధిత రైతులకు తమ భూములపై పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు లభించాయి.ఆర్థిక వెసులుబాటు: ఇకపై ఈ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు సజావుగా సాగనున్నాయి. రైతులు తక్షణమే బ్యాంక్ రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.రైతు పక్షపాతిగా ఎమ్మెల్యే..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. 22-ఏ సమస్య వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు స్వయంగా చూశాను. అందుకే పట్టుబట్టి అధికారుల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేయించి ఈ భూములను విముక్తి చేయించాం. మిగిలిన గ్రామాల్లో ఉన్న ఇలాంటి సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తాం,“ అని హామీ ఇచ్చారు.తమ భూములకు విముక్తి లభించడంతో నియోజకవర్గ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# పశ్చిమాసియా ఘర్షణలు చర్చల ద్వారా శాంతి నెలకొల్పాలి : మోడీ



న్యూఢిల్లీ : పశ్చిమాసియా ఘర్షణలు వాణిజ్యానికి, ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో గల్ఫ్‌లోని లక్షలాది మంది భారతీయుల భద్రత నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా శాంతి, సంభాషణలను ప్రోత్సహించేందుకు ఐక్యంగా గళం విప్పాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియా పరిస్థితులపై నేడు ప్రధాని మోడీ రాజ్యసభలో మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో యుద్ధం మొదలై.. మూడు వారాలు దాటింది. ఈ యుద్ధం వల్ల తీవ్రమైన ఇంధన సంక్షోభం ఏర్పడింది. భారతదేశానికి కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. యుద్ధం మన వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల సాధారణ సరఫరాకు అంతరాయమేర్పడింది అని అన్నారు. కాగా, సుమారు కోటిమంది గల్ఫ్ దేశాలలో నివసిస్తూ పనిచేస్తున్నారు. వారి ప్రాణాలకు జీవనోపాధికి భద్రత కల్పించడం భారత్‌కి ఆందోళన కలిగించే విషయం. హర్మోజ్‌లో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన నౌలు చిక్కుకుపోయాయి. వాటిల్లో పెద్ద సంఖ్యలో భారతీయ నౌకలు, సిబ్బంది ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో భారత పార్లమెంటు ఎగువ సభ అయిన రాజ్యసభ నుండి శాంతి, సంప్రదింపుల కోసం ఐక్య స్వరం యావత్ ప్రపంచానికి వినిపించడం ఆవశ్యకం. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి నేను పశ్చిమాసియాలోని చాలా దేశాల అధినేతలతో రెండు విడతలుగా ఫోన్ సంభాషణలు జరిపాను. మేము అన్ని గల్ఫ్ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాము. అలాగే ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాతో కూడా సంబంధాలు కొనసాగిస్తున్నాము అని అన్నారు. పశ్చిమాసియా సంఘర్షణల సమయంలో భారతదేశం తన పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటివరకు ఇరాన్ నుండి వెయ్యిమందికి పైగా భారత్‌కు సురక్షితంగా తిరిగి వచ్చారు. వీరిలో 700 మంది మెడిసిన్ విద్యార్థులున్నారు. మొత్తంగా 3,75,000 మందికిపైగా భారతీయులు స్వదేశానికి వచ్చారు అని మోడీ అన్నారు. యుద్ధ పరిస్థితుల్లో కూడా దేశ నౌకల్ని సురక్షితంగా తెచ్చేందుకే భారత్ ప్రయత్నిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి భారత్ చర్చల ద్వారా పరిష్కారాన్ని ఎంచుకుంది అని మోడీ చెప్పారు.

## హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఎస్‌సి హోదాకు అర్హులు



న్యూఢిల్లీ : హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఎస్‌సి హోదాను పొందగలరన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది. క్రైస్తవ మతం సహా ఒక వ్యక్తి ఏ మతంలోకి మారినా, ఎస్‌సి కమ్యూనిటీ సభ్యులకు లభించే ప్రయోజనాలను పొందలేరని పేర్కొంది. "హిందూ మతం కాకుండా వేరే మతాన్ని అనుసరించే ఏ వ్యక్తి కూడా షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించబడరు" అని నిర్దేశించే రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు, 1950లోని క్లాజ్ 3ను జస్టిస్ పి.కె.మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పులో ప్రస్తావించింది. ఈ నిబంధన కింద ఉన్న పరిమితి సంపూర్ణమైనదని పేర్కొంది. 1950లోని క్లాజ్ 3లో పేర్కొనబడని ఏ మతంలోకి అయినా ఎస్‌సి సభ్యుడు మారితే, అతను రిజర్వ్ కేటగిరీ హోదాను కోల్పోవడానికి దారితీస్తుందని కోర్టు పేర్కొంది. క్రైస్తవమతంలోకి మారిన ఎస్‌సి వ్యక్తి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్ట ఉల్లంఘన జరిగిందని వాదించలేరని తెలిపింది. క్రైస్తవమతంలోకి మారి, ప్రస్తుతం పాస్టర్‌గా వ్యవహరిస్తున్న ఒక వ్యక్తి, తనపై దాడికి పాల్పడ్డారంటూ కొంతమంది వ్యక్తులపై షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ ) చట్ట కింద దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.ు

## అక్కడ నుంచే విజయ్ ఎన్నికల ప్రచారం?



చెన్నై: ఎన్నికల పనులను పర్యవేక్షించడం కోసం చెన్నైలోని పెరంబూర్ ప్రాంతంలో తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ఓ బంగ్లాను కొనుగోలు చేసినట్లు సమాచారం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి, ఏఐఏడీఎంకే కూటమి, నామ్ తమిళర్ కట్చి, తమిళగ వెట్రి కళగం మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. ఇప్పటికే పుదుచ్చేరి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినప్పటికీ, తమిళనాడు అభ్యర్థుల జాబితాను ఇంకా విడుదల చేయలేదు. అయితే, చెన్నైలోని పెరంబూర్ నియోజకవర్గం నుంచి విజయ్ స్వయంగా పోటీ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే, పెరంబూర్ పరిధిలోని కొడుంగయ్యూర్ సమీపంలోని కన్నదాసన్ నగర్‌లో విజయ్ ఓ బంగ్లాను సొంతంగా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచార సమయంలో ఈ బంగ్లాలోనే ఉండి పనులు పర్యవేక్షించాలని విజయ్ భావిస్తున్నారని.. రేపు ఉదయం(బుధవారం) ఈ బంగ్లాలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయని సమాచారం. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, ఈ నెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతోంది. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## యుద్ధం వల్ల భారత్‌కు ఈ సవాళ్లు ఎదురయ్యాయి



ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం వేళ చోటుచేసుకున్న పరిస్థితులపై ఇవాళ రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. చర్చలు, దౌత్యం ద్వారానే ఇరాన్ యుద్ధానికి పరిష్కారమని, ఉద్రిక్తత తగ్గించేందుకు భారత్ ప్రయత్నాలు చేసిందని అన్నారు. దేశం ఐక్యంగా ఉంటే ఏ సవాలునైనా ఎదుర్కోగలమని తెలిపారు. 'యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. భారత్‌కు ఆర్థిక, భద్రత, మానవతా సవాళ్లు ఎదురయ్యాయి. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు ఉన్నారు. వారి భద్రతకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పటివరకు 3.75 లక్షల భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇరాన్ నుంచి సుమారు 1,000 మంది భారతీయులను తరలించాం. అందులో 700 మందికి పైగా మెడికల్ విద్యార్థులు ఉన్నారు. విదేశాల్లోని భారత మిషన్లు 24/7 సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. హెల్ప్‌లైన్‌లు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం కష్టతరం. అయినప్పటికీ ఇంధన సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. భారత్ వద్ద 53 లక్షల మెట్రిక్ టన్నుల చమురు నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం 41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు జరుగుతున్నాయి. ఎల్పీజీలో దేశీయ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశీయ ఉత్పత్తి పెంపుపై దృష్టి పెట్టాం. ఎథనాల్ బ్లెండింగ్ వల్ల చమురు దిగుమతులు తగ్గిస్తున్నాం. రైల్వే విద్యుతీకరణతో డీజిల్ వినియోగం తగ్గిస్తున్నాం. ఎరువుల సరఫరా కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ డిమాండ్‌కు తగిన బొగ్గు నిల్వలు ఉన్నాయి. రిన్యూవబుల్ ఎనర్జీలో భారత్ పురోగతి సాధించింది. తప్పుడు ప్రచారం, బ్లాక్ మార్కెటింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటాం. మనముందు చాలా సవాళ్లు ఉన్నాయి. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది. విదేశాల్లో ఉన్న భారతీయులందరి రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. గల్ఫ్ దేశాల్లోని భారతీయులు యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్నారు' అని మోదీ చెప్పారు.

# ఎన్నికల బాజా!




ఈసారి ఏప్రిల్ అధిక ఉష్ణోగ్రతలతోపాటు ఎన్నికల వేడిని కూడా చవిచూడబోతోంది. నాలుగు రాష్ట్రాలు-- తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాంలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో కూడా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆదివారం ప్రకటించింది. బెంగాల్‌లో రెండు దఫాలుగా ఏప్రిల్ 23, 29ల్లో పోలింగ్ జరగనుండగా, మిగిలినచోట్ల 9న ఒకే దఫాతో ముగుస్తుంది. అన్నింటి ఫలితాలూ మే 4న వెలువడతాయి. 2006 నుంచి చూస్తే వేలంపాట మాదిరి అయిదు నుంచి ఎనిమిది దఫాలుగా పోలింగ్ సాగిన చరిత్రగల బెంగాల్‌లో ఈసారి కేవలం రెండు దఫాలతో సరిపెట్టారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిపి 60.06 లక్షల మంది ఓటర్లను త్రిశంకు స్వర్గంలో ఉంచిన ఈసీ... ఆ విషయం తేలకుండానే బెంగాల్ ఎన్నికలు నిర్వహించబోతోంది. ఆ విషయంలో వచ్చిన ఫిర్యాదులను హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో ఏర్పడే అప్పిలేట్ ట్రిబ్యునళ్లు పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే 705 మంది ఆ పనిలో ఉన్నారు. రోజుకు లక్ష ఫిర్యాదుల్ని పరిష్కరిస్తున్నారు. అలా చూసుకుంటే నామినేషన్ల ఘట్టం ముగిసే ఏప్రిల్ 9 నాటికి 39 లక్షలమంది వినతులు పరిష్కారమవుతాయి. వారిలో ఎందరికి ఓటేసే భాగ్యం దక్కుతుందోగానీ... ఎటూ తేలకుండా 20 లక్షల మందికిపైగా మిగిలిపోతారు. ఎందుకంటే, ప్రజాప్రాతినిధ్య చట్టం 23(3) ప్రకారం నామినేషన్ల గడువు ముగిశాక ఎన్నికల జాబితా మారకూడదు. అధికారంలో ఉండగా ఏం చేసినా, ఎన్నికల సీజన్ వచ్చేసరికి వాగ్దానాలు వరదలై పారటం మనకు రివాజైంది. అధికారంలో ఉన్న వెసులుబాటు ఉపయోగించుకుని ఏదో పథకం పేరిట మహిళా ఓటర్ల ఖాతాలకు డబ్బు పంపిణీ సంప్రదాయం నిరుడు నవంబర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్ ఎన్డీయే కూటమి మొదలెట్టింది. దానికింద 75 లక్షల మంది మహిళలకు రూ.10,000 చొప్పున పంపిణీ అయ్యాయి. దీనికి మలి దశ కూడా ఉంటుందని చెప్పడం మరింత లాభించింది. మహిళలంతా ఎన్డీయేకు నీరాజనాలు పట్టారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా ఆ బాటలోనే 1.31 కోట్లమంది మహిళల ఖాతాలకు రూ. 5,000 చొప్పున గత నెలలో బదిలీ చేశారు. ఇవిగాక రాబోయే రోజుల్లో పార్టీలు విడుదల చేయబోయే మేనిఫెస్టోల నిండా ఎటూ ఉచితాల మోత మోగుతుంది. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో ఒక్క అస్సాంలో తప్ప మరెక్కడా బీజేపీ అధికారంలో లేదు. పుదుచ్చేరిలో మాత్రం ప్రాంతీయ పక్షం ఎన్నార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలోని అధికార కూటమిలో భాగస్వామిగా ఉంది. ఓట్ల శాతం క్రమేపీ పెరుగుతూ వస్తున్న బెంగాల్‌లో ఈసారి నిర్ణయాత్మక పాత్ర పోషించగలమని ఆ పార్టీ విశ్వసిస్తోంది. కానీ వచ్చిన ఏ అవకాశాన్నయినా అంత తేలిగ్గా వదలని తృణమూల్ అధినేత, సీఎం మమతా బెనర్జీ ముందు ఎవరి ఎత్తుగడలైనా ఫలించటం అంత తేలిక కాదు. సినీ నటుడు విజయ్ కొత్తగా ప్రారంభించిన టీవీకే పార్టీతో పొత్తు ఖరారైతే తమిళనాడు తమ జోలెలో పడుతుందని బీజేపీ ఆశిస్తోంది. మిత్రపక్షం అన్నా డీఎంకేపై పెద్దగా ఆశలేమీ లేవు. స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకేను ఢీకొనడం కష్టమే. కేరళలో వరసగా పదేళ్లు సీపీఎం నాయకత్వంలోని ఎల్‌డీఎఫ్ ఏలుబడి సాగింది గనుక అక్కడ కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్‌లో బాగా ఆశలున్నాయి. 2014 నుంచి వరసగా అధికారంలోకొస్తున్న అస్సాంలో బీజేపీ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. 2023 నాటి నియోజకవర్గాల పునర్విభజనతో ముస్లిం ప్రాతినిధ్యం ఉండే స్థానాలు 23కి పడిపోవడం, మొన్నటి బడ్జెట్‌లో మహిళలకూ, యువతకూ ప్రకటించిన రూ. 5,000 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చే పథకాలు ఆ ఆత్మవిశ్వాసానికి మూలం. కాంగ్రెస్ సంస్థాగత బలహీనతలు సరేసరి. ఈ ఎన్నికలు ఈసీ విశ్వసనీయతకు కూడా పరీక్ష. లోక్‌సభలో అభిశంసన తీర్మానం ఎదుర్కొనబోతున్న తరుణంలో ఈసారైనా తటస్థత పాటిస్తుందని అందరూ ఆశిస్తున్న తరుణంలో బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినీ, హోం కార్యదర్శినీ మార్చింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల విషయంలో వచ్చిన ఫిర్యాదులపై రెండేళ్లు దాటుతున్నా నిమ్మకు నీరెత్తినట్టున్న ఆ సంస్థ వైఖరి ఈ ఎన్నికల విషయంలో మారకపోతే మరిన్ని ఛీత్కారాలు తప్పవు. మొత్తానికి ఏ పార్టీ జాతకం ఏమిటో తెలియడానికి మే నాలుగో తేదీ వరకూ ఆగక తప్పదు.

# డ్రగ్స్ మాఫియా అరాచకం




హైదరాబాద్ శివారులో ఒక పెద్ద ఫాంహౌస్... అక్కడొక ఈత కొలను...దాని పక్కనే ఆశీనులైన బడాబాబులు... ముందున్న టేబుళ్లపై ఖరీదైన మద్యం సీసాలు, మాదక ద్రవ్యాలు... జర్మన్ తయారీ రివాల్వర్‌తో పోలీసులపై కాల్పులు, బెదిరింపులు, వాగ్వాదాలు-- క్రైమ్ కథాచిత్రాన్ని తలదన్నే శనివారం నాటి ఈ దృశ్యం మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయంటే కించిత్తు ఆశ్చర్యం కలుగుతుంది. మొన్న జనవరిలో కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పక్షమైన బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి పట్టుబడితే, తాజాగా ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌తోపాటు మరికొందరు దొరికిన వైనం దీన్ని రుజువు చేస్తోంది. వేయి తలల విషనాగు లాంటి మాదక ద్రవ్య మహమ్మారి ఆనుపానులు రాబట్టడానికి, దాన్ని అంతమొందించటానికి పోలీసులు నానా తంటాలూ పడుతున్నారు. కానీ బడి పిల్లలు మొదలుకొని ఆడ మగ తేడా లేకుండా అందరినీ కాటేస్తున్న ఈ విషనాగు వెనక రాజకీయ పలుకుబడి గల కుటుంబాలున్నాయనీ, కనుకనే దాని అదుపు అసాధ్యమవుతున్నదనీ ఈ పరిణామాలు తెలియజెబుతున్నాయి. ఒకరా ఇద్దరా... తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే నితీశ్ శర్మ, ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నమిత్ శర్మ వగైరా 11 మంది ఈ డ్రగ్స్ దందాలో దొరికారు. రెండేళ్ల నాడు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతల ప్రసంగాలను గుర్తుంచుకుని ఇప్పుడు వెల్లడవుతున్న పరిణామాలతో బేరీజు వేసుకుంటే ఆ నేతల వంచన ఏపాటిదో అర్థమవుతుంది. మాదక ద్రవ్యాలకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిందంటూ వారు పెడబొబ్బలు పెట్టారు. 'మేం వస్తే వంద రోజుల్లో అరికడతామ'ంటూ ప్రగల్భాలు పలికారు. కానీ అధికారంలోకొచ్చాక అంతవరకూ సాధించిన విజయాలను గుల్లచేశారు. అది మళ్లీ తలెత్తి విస్తరించటానికి అవకాశమిచ్చారు. అప్పటి దుష్ప్రచారమంతా గెలుపు కోసం మాత్రమే కాదు... మాదక ద్రవ్యాలను అరికట్టడం వల్ల కలుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం కోసమని ఆ కూటమి పీఠం ఎక్కింది మొదలు జరుగుతున్న ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఇసుక మాఫియా, మద్యం మాఫియా, డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా చెలరేగుతున్నాయి. 'గంజాయి వద్దు బ్రో...' అంటూనే మాదక ద్రవ్యాలకు తలుపులు బార్లా తెరిచారు. ఏపీలో మాదక ద్రవ్య చీడను అంతమొందించటానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఆపరేషన్ పరివర్తన్‌ను రెండు దశల్లో విజయవంతంగా అమలు చేసింది. దానికితోడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఏర్పాటు చేసింది. ఆంధ్ర--ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో ఉండే 11,500 ఎకరాల్లోని గంజాయి సాగును ధ్వంసం చేయడంతోపాటు, గిరిజనులు ఇతర పంటల వైపు మళ్లేలా రూ. 500 కోట్లతో ప్రోత్సాహకాలందించింది. విస్తృత తనిఖీలు చేపట్టింది. ఈ కృషినంతా కూటమి పాలన నీరుగార్చింది. పర్యవసానంగా విద్యాసంస్థల్లో చిల్లరగా... ఫామ్‌హౌస్ పార్టీలకు టోకుగా గంజాయి, కొకైన్, ఎల్‌ఎస్‌డీ, ఎండీఎంఏ వగైరాలు చేరిపోతున్నాయి. ఏడాదికి రూ.5,000 కోట్లు వెనకేసుకోవడమే లక్ష్యంగా సాగుతున్న ఈ దందాకు మూలవిరాట్టులు చంద్రబాబు చుట్టూ ఉండే సీనియర్ నేతల కుటుంబాలవారు కావటంతో ఏపీ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. మాదక ద్రవ్యాల వ్యాప్తిపై వెల్లడవుతున్న గణాంకాలు విస్తుగొలుపుతున్నాయి. నిరుడు దేశవ్యాప్తంగా భద్రతా విభాగాలకు రూ. 25,330 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయి. అంతక్రితంతో పోలిస్తే ఇది 55 శాతం కన్నా అధికం. ఏపీలో వీటికి అలవాటుపడిన వారిలో 10--17 ఏళ్ల మధ్య గలవారి సంఖ్య 3.19 లక్షలు ఉన్నట్టు చెబుతున్నారు. వీటి వెనక డబ్బాశ మాత్రమే కాదు, దాని ఆసరాతో రాజకీయాలను శాసించటం అసలు లక్ష్యం. మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో తెలంగాణ పోలీసులకు అంతో ఇంతో మంచి పేరుంది. కానీ తాజా కేసు తీవ్రత తెలిసి కూడా, నిందితుడిగా ఉండాల్సిన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చి ఆ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా వ్యవహరిస్తేనే ఉగ్రవాదాన్ని మించిన ఈ మహమ్మారి దుంపనాశనం సాధ్యం.

# ఇరాన్ ఊబిలో ట్రంప్!

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దురాక్రమణ యుద్ధం పద్దెనిమిదో రోజుకు చేరుకున్నా ఆ రెండు దేశాలకూ దారీతెన్నూ తోచడం లేదు. మంగళవారం కీలకమైన ఇద్దరు ఇరాన్ నేతలు అలీ లారిజానీ, సులేమానీలనూ, బుధవారం మరో అగ్రశ్రేణి నేత ఇస్మాయిల్ ఖతీబ్‌నూ హతమార్చామని అమెరికా, ఇజ్రాయెల్ ఘనంగా చెప్పుకున్నా ఈ పరిణామాల తక్షణ ప్రభావం పెద్దగా లేదని ఇరాన్ సాగిస్తున్న ప్రతిదాడులే నిరూపిస్తున్నాయి. యుద్ధకాలంలో ఎవరి ఆదేశాల కోసమూ ఎదురుచూడకుండా ఏయే దశల్లో ఎలా స్పందించాలో దేశం నలుమూలలా మోహరించి ఉన్న సైనిక దళాలకు ముందే నిర్దేశించి ఉండటం ఇందుకు కారణం. యుద్ధరంగంలో సాధిస్తున్న విజయాల గురించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏం చెప్పుకుంటున్నా ఆయనకు ప్రతికూలతలే ఎదురవుతున్నాయని మంగళవారం నాటి రెండు పరిణామాలు చాటుతున్నాయి. హోర్ముజ్ జలసంధి విముక్తికి యుద్ధ నౌకలతో, విమానాలతో తరలి రావాలన్న ట్రంప్ పిలుపును నాటో దేశాలు తిరస్కరించాయి. 'మీ యుద్ధంతో మాకేమిటి సంబంధమ'ంటూ ఎదురు ప్రశ్నించాయి. దానికితోడు అమెరికా జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం (ఎన్‌సీటీసీ) చీఫ్ జో కెంట్ తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా భద్రతకు ఏమాత్రం ముప్పులేని ఇరాన్‌పై యుద్ధం ప్రకటించటం అనైతికమని ఆయన ప్రకటించారు. జో కెంట్ మొదటి నుంచీ ట్రంప్‌కు గట్టి మద్దతుదారు. 'మాగా' ఉద్యమ సూత్రధారుల్లో ఒకరు. ట్రంప్ చుట్టూ చేరిన పాలనా వ్యవస్థలోని ఇజ్రాయెల్ అనుకూలురు, ప్రధాన మీడియా ఆయన్ను పక్కదోవ పట్టించాయన్నది కెంట్ అభియోగం. ట్రంప్‌ది అమాయకత్వమా, మూర్ఖత్వమా అన్న సంగతలా ఉంచి అమెరికా అధ్యక్షులుగా ఎవరున్నా ఇజ్రాయెల్ మాటే చెల్లుబాటవుతున్నదని చరిత్ర చూస్తే తెలుస్తుంది. అయితే ప్రస్తుత యుద్ధం ఇజ్రాయెల్ కోసమే అయినా రెండు దేశాలూ సమాన స్థాయిలో ఇరాన్‌పై విరుచుకుపడుతున్నాయి. అమెరికా ఇంతవరకూ 7,000 లక్ష్యాలపై విరుచుకుపడగా, ఇజ్రాయెల్ 7,600 దాడులు చేసిందని సోమవారం అమెరికా సెంట్రల్ కమాండ్ లెక్కలు చెబుతున్నాయి. సైనికంగా ఇరాన్‌ను బలహీనపరచటం శక్తిమంతమైన అమెరికాకు



పెద్ద కష్టం కాకపోవచ్చు. ఇరాన్ దగ్గరున్న డ్రోన్‌లూ, క్షిపణులూ కాలం గడుస్తున్నకొద్దీ తగ్గిపోవచ్చు. అదే పరిస్థితి కాస్త వెనకో ముందో ఇజ్రాయెల్, అమెరికాలకు కూడా ఎదురవుతుంది. కానీ దీర్ఘకాలం ఈ యుద్ధాన్ని సాగదీయటం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థనూ, ఆ తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థనూ కోలుకోలేని విధంగా దెబ్బతీసే శక్తి ఇరాన్‌కుంది. గత నెల 24న జాతినుద్దేశించి ట్రంప్ ప్రసంగించినప్పుడు అందులో ఎక్కడా ఇరాన్ ప్రస్తావన లేదు. ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలు, ద్రవ్యోల్బణం గురించే ఆయన ఏకరువు పెట్టారు. ఇప్పుడు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించటంతో అవి పట్టపగ్గాల్లేకుండా విజృంభిస్తున్నాయి. మున్ముందు మరింత ఉగ్రరూపం దాలుస్తాయి. అందుకే ట్రంప్ విజయాలేవీ అమెరికన్లను రంజింప జేయలేక పోతున్నాయి. కనుకనే అందరిపైనా ట్రంప్ ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. మాట వినని నాటో మాత్రమే కాదు... నిలదీస్తున్న రిపబ్లికన్లు, యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న 'మాగా' ఉద్యమ కారులు ఆయన్ను కుదురుగా ఉండనీయటం లేదు. ఆయన చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలే అందుకు రుజువు. తొలుత బ్రిటన్ సాయాన్ని అర్థించి, ఆ తర్వాత హోర్ముజ్ విముక్తికి సహకరించమని నాటోతోపాటు చైనాను కూడా వేడుకుని, వారంతా నిరాకరించాక ఇరాన్‌ను ఒంటరిగానే ఎదుర్కొంటామంటూ ఆర్భాటంగా ప్రకటించడం ఆయన మానసిక స్థితిని వెల్లడిస్తోంది. నాటోను కోరడంలో వింతేమీ లేదు. కానీ ఆర్థిక రంగంలో సవాలుగా మారిన చైనాను అర్థించటం ట్రంప్ బలహీనతను బయటపెడుతోంది. 2003 నాటి ఇరాక్ దురాక్రమణ అమెరికాను ఆర్థికంగా దెబ్బతీస్తే, ఆ మేరకు చైనా లాభపడింది. ఇప్పుడు సైతం చైనా అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తుండగా, అది సాయ పడుతుందని ట్రంప్ ఎలా అనుకున్నారో అనూహ్యం. మొత్తానికి ఆయన ఇరాన్ అనే ఊబిలో దిగబడ్డారు. దాన్నుంచి బయటపడటం సులభమేం కాదు.

# సీతమ్మ ఎగ్జిట్ తో యామీ గౌతమ్ సీన్లోకి!



బాలీవుడ్ డైరెక్టర్ ఆనంద్ ఎల్ . రాయ్ ధనుష్, కృతి సనన్ జంటగా 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదొక రొమాంటిక్ లవ్ స్టోరీ. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. - అత్రాంగిరే - తర్వాత ధనుష్ తో ఆనంద్ తెరక్కిస్తోన్న మరో చిత్రం కావడంతో? ఈరేంజ్ బజ్ క్రియేట్ అవుతోంది. - గుడ్ లక్ జెర్రీ -, -% రక్షాబంధన్ - లాంటి సినిమాల వైఫల్యం తర్వాత ఆనంద్ ఎల్ . రాయ్ నుంచి రిలీజ్ అవుతోన్న చిత్రమిది. దీంతో ఈ సినిమాతో ఎలాగైనా కంబ్యాక్ అవ్వాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టే మార్కెట్లో బజ్ నెలకొంది. కాగా ఈ సినిమా సెట్స్ ఉండగానే ఆనంద్ మరో ప్రాజెక్ట్ కూడా సెట్ చేస్తున్నారు. - నయి నవేలీ - అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. భారతీయ జానపద కథలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హారర్ కామెడీ కథగా తెలుస్తోంది. ఇందులో హీరోయిన్ గా కృతిసనన్ ఎంపికైంది. తేరే ఇష్క్ మే%-%లో కృతి పెర్ఫార్మెన్స్ చూసి మరోసారి హీరోయిన్ ఛాన్స్ తనకే ఇచ్చాడు ఆనంద్. అయితే ఇప్పుడా ప్రాజెక్ట్ నుంచి కృతిసనన్ అనూహ్యంగా తప్పుకుంది. ఆమె ఎందుకు ఎగ్జిట్ అయిందన్నది తెలియదు గానీ ..మరో ఆలోచన లేకుండా రాయ్ అదే పాత్రకు యామీ గౌతమ్ ని ఎంపిక చేసారు. కృతి కంటే ఇప్పుడా పాత్రకు యామీ పర్ఫెక్ట్ గా సూటవుతుందని చిత్ర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో కృతిసనన్-ఆనంద్ ఎల్ రాయ్ మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ ఏవైనా తలెత్తాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి అసలు కారణం ఏంటి? అన్నది తెలియాలి. ఈ ఏడాది చివరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని రాయ్ టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇంతలోనే కృతి సనన్ తప్పుకోవడం..ఆమె స్థానంలోకి యామీ గౌతమ్ రావడం అంతా వేగంగా జరిగిపోయాయి. ప్రస్తుతం యామీ సక్సెస్ పరంగా మంచి స్వింగ్ లో ఉంది. %-%ఆర్టికల్ 370%-, -%ఓఎమ్ జీ 2%-% లాంటి శక్తివంతమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించింది. త్వరలో - హక్ - అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇంతలోనే ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో నటించే అరుదైన అవకాశం ఒడిసి పట్టుకుంది.

# పూరీ 'స్లమ్ డాగ్'.. రిలీజ్ కు ఇబ్బందులు తప్పవా?




స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం టాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న ఆ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా కనిపించనున్నారు. కీలక పాత్రల్లో టబు, దునియా విజయ్ కుమార్ నటిస్తున్నారు. రీసెంట్ గా ఆ మూవీకి స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్ అనే టైటిల్ ను ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. జనవరిలో విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ టైటిల్ ను రివీల్ చేస్తూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తి పెంచింది. పోస్టర్ లో ఆయన బిచ్చగాడి గెటప్ లో కనిపిస్తూ.. చేతిలో రక్తంతో తడిసిన కత్తి పట్టుకుని పవర్ ఫుల్ లుక్ లో మెప్పించారు. చుట్టూ చెల్లాచెదురుగా పడి ఉన్న డబ్బు కట్టలు కథలోని ఇంటెన్సిటీ సూచిస్తున్నాయి. సినిమాను పూరీ కనెక్ట్స్ బ్యానర్ పై పూరీ జగన్నాథ్ తో కలిసి చార్మీ కౌర్ నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ తరపున జేబీ నారాయణరావు నిర్మాణంలో భాగమయ్యారు. సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే.. షూటింగ్ ను కేవలం ఐదు నెలల్లో పూర్తి చేశారు. అయితే సినిమా విడుదలకు ముందు కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన గత చిత్రం లైగర్ చుట్టూ ఉన్న ఆర్థిక వివాదాలే. ఆ సినిమా వల్ల కొంతమంది డిస్ట్రిబ్యూటర్లకు నష్టాలు వచ్చాయని, వారికి చెల్లించాల్సిన బకాయిలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని టాక్ ఉంది. ఇక తర్వాత వచ్చిన డబుల్ ఇస్మార్ట్ సినిమా సమయంలో, బకాయిల్లో కొంత మొత్తం చెల్లించి, మిగిలిన దాన్ని సినిమా విడుదల తర్వాత చెల్లిస్తానని పూరీ మాటిచ్చారని సమాచారం. అయితే ఆ హామీ పూర్తిగా నిలబెట్టుకోలేదని ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు పంపిణీదారులు బకాయిలు క్లియర్ అయ్యేవరకు పూరీ జగన్నాథ్ సినిమాలు రిలీజ్ చేయనివ్వకూడదని వారు నిర్ణయించుకున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇదే కారణంగా గతంలో విడుదలకు సిద్ధమైన పోకిరి రీ రిలీజ్ నిలిచిపోయిందని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో స్లమ్ డాగ్ సినిమా విడుదల సమయంలో ఏం జరుగతుందోన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. సినిమా షూటింగ్ పూర్తి అయినప్పటికీ, ఫైనాన్షియల్ క్లియరెన్స్ లేకపోతే రిలీజ్ ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్. ఏదేమైనా కంటెంట్ పరంగా ఆసక్తి రేకెత్తిస్తున్న ఆ సినిమా,, విడుదల సమయంలో ఆర్థిక సమస్యలను ఎలా అధిగమిస్తుందన్నది చూడాల్సి ఉంది. ప్రేక్షకులు మాత్రం విజయ్ సేతుపతి- పూరీ జగన్నాథ్ కాంబినేషన్ పై మంచి అంచనాలు పెట్టుకున్నారు.



# చీరకట్టుతో చెమటలు పట్టిస్తున్న బేబమ్మ.. ఇంత సోయగాన్ని ఎలా మిస్ అయ్యాం?



కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు. శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశి గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ముఖ్యంగా ఈమె అందాలను చూసి ఏఐ జనరేటర్ లాగా ఉంది అని



కామెంట్లు చేస్తుంటే.. మరికొంతమంది లవ్, ఫైర్, స్మైల్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది నువ్వే నా జాన్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు తమ ప్రేమను ఒలకబోస్తూ కృతి శెట్టి ఫోటోలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృతి శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాలో నటిస్తోంది.





# విద్యార్థులకు సమంత విలువైన సలహా!

చదువు పేరుతో పిల్లలపై పాఠశాలలు, కళాశాలల ఒత్తిడి ఎక్కువవుతోందన్నది వాస్తవం. ర్యాంకుల కోసం బట్టి పట్టించే తీరు మారాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కూడా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో? పలు సూచనలు సలహాలు సైతం ప్రభుత్వాలు జారీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నటి సమంత ఈ అంశంపై మాట్లాడింది. జీవితానికి మంచి మార్కులు, గ్రేడులే ముఖ్యం కావని మానవతా విలువలు కూడా అంతే అవసరమన్నారు. చదువుతో పాటు మంచి విలువలు ఉండేలా పిల్లలకు అన్ని రకాల విద్యలు నేర్పించాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సమయం దొరకడం లేదని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. తాను విద్యార్థిగా ఉండి చాలా కాలమైందని.. కానీ ప్రస్తుతం విద్యార్థుల పడుతోన్న బాధలు, ఇబ్బందుల గురించి పత్రికల్లో , సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు చూస్తుంటే గుండె తరుక్కు పోతుందన్నారు. పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారనిపిస్తుందన్నారు. తాను స్కూల్ చదువుకుంటోన్న రోజుల్లో అలాంటివి ఏవీ లేవనిస్నేహం, దయ, సానుభూతి, ఇతరుల పట్ల గౌరవం వంటి లక్షణాలే తనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. మంచి మనిషిగా ఎలా ఉండాలో పాఠశాల నేర్పిస్తుందన్నారు. అప్పుడు నేర్చుకున్నవే జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలో సహకరిస్తాయంది. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదరైనా నిలబడే ధైర్యాన్ని కూడా పాఠశాల దశ నుంచే పిల్లలు అలవాటు చేసుకోవాలన్నారు. ఇలాంటి అంశాలతో కూడిన పాఠ్యాంశాలను జోడిస్తే బాగుంటుందన్నారు. 2023 లో దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. మహారాష్ట్రలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయని గుర్తు చేసారు. సమంత సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా ఉంటారన్న సంగతి తెలిసిందే. సొంతంగా చారిటీలను కూడా నిర్వహిస్తున్నారు. అనాధశ్రమాలు, పిల్లలను చదివించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.ప్రస్తుతం సమంత నటిగా సినిమాలు చేయని సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లకు పని చేస్తోంది. కొత్త సినిమాలకు సంబంధించి అప్ డేట్స్ త్వరలో వచ్చే అవకాశం ఉంది.

# గ్లామర్ క్వీన్ శోభితడ ఎల్ కవర్‌పై కొత్త స్టైల్‌తో సందడి!









గ్లోబల్ బ్యూటీ శోభిత ధూళిపాళ్ల మరోసారి ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వేదికపై తన ముద్ర వేసింది. ప్రతిష్టాత్మకమైన 'ఎల్' (జూరాజు) మ్యాగజైన్ 'ది ఆర్ట్ ఇష్యూ' కోసం కవర్ స్టార్‌గా మారి అందరి దృష్టిని ఆకర్షించింది. తనదైన స్టైల్, గ్రేస్ మరియు అదిరిపోయే యాటిట్యూడ్‌తో శోభిత చేసిన ఈ ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవలం గ్లామర్ మాత్రమే కాకుండా, తన ఆలోచనలతో కూడా మెప్పిస్తున్న ఈ బ్యూటీ గురించి మరిన్ని విశేషాలు ఇప్పుడు చూద్దాం. మ్యాగజైన్ కవర్‌పై మెరుపులు: ఫ్యాషన్ ప్రపంచంలో ఎల్ మ్యాగజైన్ కవర్‌పై కనిపించడం అంటే సామాన్యమైన విషయం కాదు. శోభిత ధూళిపాళ్ల తన అద్భుతమైన పర్సనాలిటీతో ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఈ షూట్‌లో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, ఆమె ఇచ్చిన పోజులు చాలా ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. కేవలం నటనతోనే కాకుండా, ఫ్యాషన్ సెన్స్‌తో కూడా శోభిత తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుందని ఈ కవర్ పేజీ చూస్తే అర్థమవుతోంది. ఆమె కళ్లలో ఉన్న తీక్షణత, ధరించిన హై-స్లిట్ డ్రెస్ ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చాశ్రీంశీ =ముౕం - ఆ హీరోయిన్ దృష్టిలో తమ్ముడే అత్యుత్తమ నటుడు! నటనలో తనదైన ముద్ర: శోభిత కేవలం గ్లామర్ డాల్‌గా మిగిలిపోవడానికి ఇష్టపడదు. ఆమె ఎంచుకునే పాత్రలు చాలా లోతుగా, ఆలోచింపజేసేలా ఉంటాయి. "మహిళలు విభిన్నమైన మనస్తత్వాలను కలిగి ఉన్నప్పుడే వారు చాలా ఆసక్తికరంగా కనిపిస్తారు" అని ఆమె ఈ ఇంటర్వ్యూలో తెలిపింది.అంటే కేవలం తెరపై కనిపించడం కోసమే కాకుండా, పాత్రలో లీనమై నటించడం తన నైజమని ఆమె చెప్పుకొచ్చింది. 'మేడ్ ఇన్ హెవెన్', 'గూఢచారి', 'మేజర్' వంటి చిత్రాలు ఆమె నటనలోని వైవిధ్యాన్ని ఇప్పటికే చాటిచెప్పాయి. ఈ షూట్ థీమ్ 'ఆర్ట్' కావడంతో, శోభిత తనలోని కళాత్మక కోణాన్ని ఆవిష్కరించింది. తన జీవితంలో క్యూరియాసిటీ అనేది తనను ముందుకు నడిపించే దారి అని ఆమె తెలిపింది. సినిమా అయినా, ఫ్యాషన్ అయినా అందులో కొత్తదనాన్ని వెతకడం ఆమెకు అలవాటు. ఫ్యాషన్ అనేది కేవలం బట్టలు వేసుకోవడం మాత్రమే కాదని, అది ఒక రకమైన భావ వ్యక్తీకరణ అని ఆమె నమ్ముతుంది. అందుకే ఆమె ఫోటోషూట్‌లు ఎప్పుడూ రొటీన్‌కు భిన్నంగా, చాలా స్పెషల్‌గా ఉంటాయి. సోషల్ మీడియాలో వైరల్ ఫోటోలు: శోభిత ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే అభిమానుల నుంచి భారీ స్పందన లభించింది. ఇక ముఖ్యంగా అక్కినేని నాగచైతన్యతో పెళ్లి తర్వాత ఆమెకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ కోసం నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇలాంటి పవర్‌ఫుల్ ఫోటోషూట్‌తో రావడం ఆమె ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ అని చెప్పాలి. కేవలం మన దేశంలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో శోభిత క్రేజ్ పెరుగుతోందనడానికి ఈ ఎల్ మ్యాగజైన్ కవర్ ఒక నిదర్శనం.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .